

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 86 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప శనివారం 28 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :86 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED :KADAPA SAT 28 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

అమెరికాను ముంచెత్తిన వరదలు, మంచు తుపాను

పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ



పెన్ పవర్ డెస్క్:అమెరికాలో అత్యంత ఘనంగా జరుపుకు నే 'థాంక్స్ గివింగ్' పండుగ వేళ ప్రకృతి తీవ్ర ప్రకోపం చూపించింది. భారీ వర్షాలు,

- మిగతా 2లో

నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి

పోలీసులకు అభిజిత్ దీప్కే సవాల్

- పోలీసుల లుకౌట్ నోటీసులపై బహిరంగంగా స్పందించిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే
- నాగ్‌పూర్ నిరసన సభలో పోలీసులకు అరెస్ట్ సవాల్ విసిరిన వైనం
- కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ



- మిగతా 2లో

హసీనా ఓ 'ముల్లు'లా మారారు - బంగ్లాదేశ్



పెన్ పవర్ డెస్క్:భారత్-బంగ్లాదేశ్ సంబంధాల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా ఓ 'ముల్లు'లా మారారని బంగ్లాదేశ్ పేర్కొంది. ఆమెకు ఆశ్రయం ఇవ్వడం ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడి పెంచుతోందని భారత్ ఇప్పుడిప్పుడే తెలుసుకుంటోందని వ్యాఖ్యానించింది. ఆమెను బయటకు పంపించలేక, ఆశ్రయం కల్పించడాన్ని సమర్థించుకోలేక భారత్ ఇబ్బందులు పడుతోందని పేర్కొంది. డిసెంబర్ 16న హసీనా

- మిగతా 2లో

కోట్ల విలువైన భూముల వ్యవహారాలపై అనుమానాలు..

పెందుర్తి మండల పరిధిలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు సంబంధించి వివిధ లావాదేవీలు, రికార్డుల మార్పులు, భూ ఆక్రమణల ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, రెవెన్యూ కార్యాలయంలో కీలక బాధ్యతల మార్పు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని భూ వ్యవహారాల్లో సంబంధిత రికార్డులు, ఫైళ్ల నిర్వహణ, క్షేత్రస్థాయి నివేదికలు కీలకంగా ఉండే సమయంలో, బాధ్యతల మార్పు వల్ల ఎవరికైనా అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయా? భూ ఆక్రమణదారులకు ప్రయోజనం చేకూరేలా ఏమైనా చర్యలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని స్థానికంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. కోట్ల విలువైన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు లేదా అనధికార లావాదేవీలకు మార్గం సుగమం చేసేందుకు ఈ మార్పులు ఉపయోగపడుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, వాటిని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడికాలేదు. అందువల్ల ఈ అంశాలన్నింటినీ ఉన్నతాధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో 'పోస్టుల గారడీ'!

కోట్ల విలువైన భూముల వ్యవహారాల కోసమే బాధ్యతల మార్పా?



- ఆర్ఐని పక్కకు తప్పించి.. సీనియర్ అసిస్టెంట్‌కు కీలక బాధ్యతలు!
- తహశీల్దార్ నిర్ణయంపై రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చ
- ఆర్డీవో, జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టాలి

పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 25 : స్థానిక పెందుర్తి మండల తహశీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఉద్యోగుల బాధ్యతల మార్పు వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పరిపాలనా సౌలభ్యం పేరుతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), సీనియర్ అసిస్టెంట్ పోస్టుల మధ్య చేపట్టిన పరస్పర ఇన్‌చార్జ్ నియామకాల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు సంబంధించిన లావాదేవీలు, రెవెన్యూ రికార్డుల వ్యవహారాలు ఈ మార్పులతో ముడిపడి ఉన్నాయా? అన్న అనుమానాలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌సీ నంబర్ 1/2026/జ, తేదీ 12-11-2026తో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. భార్గవ్ వెంకటేష్‌ను సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఇన్‌చార్జిగా, సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జె. లోకేష్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఇన్‌చార్జిగా నియమించారు. కార్యాలయ పరిపాలనా సౌలభ్యం, అధికారిక విధుల సమర్థవంతమైన నిర్వహణ, పనుల సక్రమ పంపిణీ కోసం ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏర్పాటు పూర్తిగా తాత్కాలికమని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

- మిగతా 2లో



Rc.No. ఎ | /2026/C, Dt.12-11-2026 O/o the Tahsildar,Pendurthi Mandal.

PROCEEDINGS OF THE TAHSILDAR, PENDURTHI MANDAL
PRESENT: SRI J. VENKATA APPARAO

Sub:- Public Services –Visakhapatnam District & Division – Pendurthi Mandal – Reciprocal incharge arrangements – Sri J.Lokesh,Senior Assistant,O/o Tahsildar Pendurthi is kept incharge of the post of Mandal Revenue Inspector ,Pendurthi and Sri S.Bhargav Venkatesh, Mandal Revenue Inspector, O/o Tahsildar Pendurthi is kept incharge of the Post of Senior Assistant, O/o Tahsildar Pendurthi for administrative convenience and efficient functioning of the office – Orders issued – Regarding.

Read:- Administrative exigencies.

&&&

ORDER:

In view of the administrative exigencies and in order to ensure smooth functioning of the office administration, effective discharge of official duties and proper distribution of work, it has been considered necessary to interchange the responsibilities of the Revenue Inspector and Senior Assistant in this Mandal.

In view of the above, **Sri S.Bhargav Venkatesh, Mandal Revenue Inspector,** is hereby kept in-charge of the post of Senior Assistant, and **Sri J.Lokesh, Senior Assistant,** is hereby kept in-charge of the post of Revenue Inspector, with immediate effect.

The individuals concerned shall discharge the duties and responsibilities attached to their respective in-charge assignments, ensuring that the day-to-day administration of the office is carried out smoothly and efficiently.

The above arrangement is purely temporary and is made in the interest of administrative convenience and efficient administration, until further orders.

The individuals concerned are hereby instructed to assume the respective in-charge responsibilities with immediate effect and ensure proper handing over and taking over of the concerned records, files and other official responsibilities.

Pendurthi Mandal

To:
Sri S.Bhargav Venkatesh, Revenue Inspector, O/o Tahsildar,Pendurthi Mandal
Sri J.Lokesh, Senior Assistant, O/o Tahsildar,Pendurthi Mandal



డీలిమిటేషన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం!

అన్ని రాష్ట్రాల్లో 50 శాతం లోక్‌సభ సీట్లు పెంపు

- మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త ప్రతిపాదన
- లోక్‌సభ స్థానాలు 815కు పెంపు!
- ఏపీకి 38, తెలంగాణకు 26 ఎంపీ సీట్లు..
- రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తి 2051 వరకు కొనసాగింపు..
- నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే డీలిమిటేషన్ ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచే ప్రతిపాదనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు కొనసాగించేలా కొత్త బిల్లులో నిబంధనలు రూపొందించినట్లు సమాచారం.

- మిగతా 2లో

దక్షిణాది సీట్లకు ఢోకా వద్దు!

50 శాతం పెంపే సరైన పరిష్కారం

- ఢిల్లీలో కుమారస్వామితో కలిసి మీడియాతో మాట్లాడిన ఏపీ సీఎం..
- మహిళా రిజర్వేషన్ల అమలుపైనా కీలక వ్యాఖ్యలు
- జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాదికి అన్యాయం జరగకూడదని స్పష్టీకరణ
- రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో సహకరించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో



ఉన్నది ఒక్కటే జీవితం..
సార్థకం చేసుకోండి..

యువతకు చిరంజీవి పిలుపు



పెన్ పవర్ డెస్క్:ఎవరికైనా జీవితం ఒక్కటేనని, చెడు అలవాట్లకు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని అగ్ర కథానాయకుడు చిరంజీవి పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' ముగింపు

- మిగతా 2లో

దీపం వెలిగించాల్సిందే

తిరుపరంకుండ్రం ఆలయ వివాదంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్: తిరుపరం కుండ్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపరంకుండ్రం కొండపై ఉన్న పురాతన దీపత్తూన్ స్తంభంపైనే శనివారం సంప్రదాయబద్ధంగా కార్తీక దీపాన్ని

- మిగతా 2లో



ఏపీలో ఖాతా తెరిచిన ఆమ్ ఆద్మీ పార్టీ..

పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు 'ఆప్' బలపరిచిన అభ్యర్థుల విజయం

- ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ బోణీ
- దుప్పలపూడి పంచాయతీలో రెండు వార్డులు కైవసం
- 3వ వార్డులో కొల్లాపు లక్ష్మణ్ విజయం
- 6వ వార్డులో గెలుపొందిన తంగుడు దుర్గ
- అభ్యర్థులకు అభినందనలు తెలిపిన పార్టీ నాయకత్వం

- మిగతా 2లో

కేసీఆర్ వార్నింగ్ ఇవ్వడంతోనే జగన్ పనులు ఆపేశారు

- రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ చేసిన వ్యాఖ్యలకు కాల్వ శ్రీనివాసులు కౌంటర్
- జగన్ కు వార్నింగ్ గురించి గతంలో హరీశ్ రావు చెప్పారన్న టీడీపీ ఎమ్మెల్యే
- ప్రాజెక్టుపై స్టే వచ్చినా అప్పీల్ చేయకుండా జగన్ తాత్సారం చేశారని విమర్శ

- మిగతా 2లో



గుంటూరు మార్కెట్‌లో మునగకాయ

ధరలు పైపైకి..
కిలో రూ.150!

- గుంటూరు మార్కెట్‌లో మునగకాయ ధర రికార్డు స్థాయికి చేరిక
- ఒక్కో మునక్కాయ ధర గరిష్ఠంగా రూ. 30 నమోదు
- కార్తిక మాసం, పెళ్లిళ్ల సీజన్‌తో పెరిగిన డిమాండ్
- తుపాన్లు, వర్షాభావం కారణంగా తగ్గిన స్థానిక దిగుబడి
- మరో రెండు నెలల వరకు ధరలు తగ్గే అవకాశం లేదన్న వ్యాపారులు

- మిగతా 2లో





డీలిమిటేషన్.. దేశ రాజకీయ ముఖచిత్రం మారేనా?

నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం కీలక అడుగు,

జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యంలో మార్పులకు అవకాశం,

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై సర్వత్రా చర్చ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మరో కీలక అధ్యాయానికి తెరలేచే సంకేతాలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వస్తున్న వార్తలు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 30న లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఇది కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చే ప్రక్రియగానే కాకుండా దేశ రాజకీయ అధికార సమీకరణాలను ప్రభావితం చేసే కీలక పరిణామంగా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రజాస్వామ్యంలో డీలిమిటేషన్ ప్రాధాన్యం : ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజాప్రాతినిధ్యమే పునాది. జనాభాలో వచ్చిన మార్పులకు అనుగుణంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్ణయించే ప్రక్రియను డీలిమిటేషన్‌గా వ్యవహరిస్తారు. ప్రతి ఓటరుకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, జనాభా అసమానతలను తగ్గించడం, నియోజకవర్గాల మధ్య సమతుల్యత సాధించడం దీని ప్రధాన లక్ష్యాలు. దేశంలో పట్టణీకరణ, వలసలు, జనాభా పెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. ఈ అసమానతలను సరిదిద్దేందుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరమే అయినప్పటికీ, అందుకు అనుసరించే ప్రామాణికాలే ఇప్పుడు కీలకంగా మారాయి.

రాజ్యాంగం ఏం చెబుతోంది? : భారత రాజ్యాంగంలోని 82, 170 అధికరణలు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన అంశాలను నిర్దేశిస్తున్నాయి. జనాభా నియంత్రణ చర్యలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్రాలవారీగా లోక్‌సభ స్థానాల కేటాయింపులో మార్పులపై గతంలో ఆంక్షలు విధించారు. 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 తర్వాత నిర్వహించే తొలి జనగణనకు సంబంధించిన గణాంకాలు ప్రచురితమయ్యే వరకు ఈ పరిమితిని కొనసాగించేలా నిబంధనలు రూపొందించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనకు ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారు? ఏ జనాభా గణాంకాలను ప్రామాణికంగా తీసుకుంటారు? ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచుతారా? రాష్ట్రాల మధ్య స్థానాల నిష్పత్తిలో మార్పులు చేస్తారా? అన్న ప్రశ్నలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

దక్షిణాదికి జనాభా నియంత్రణే శాపమవుతుందా? : డీలిమిటేషన్ అంశంలో ప్రధానంగా వ్యక్తమవుతున్న ఆందోళన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించినది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ, విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి రంగాల్లో సాధించిన పురోగతి కారణంగా జనాభా వృద్ధిని నియంత్రించగలిగాయి. మరోవైపు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో జనాభా వృద్ధిరేటు అధికంగా ఉంది. కేవలం జనాభా సంఖ్యనే ప్రామాణికంగా తీసుకుని లోక్‌సభ స్థానాలను పునఃకేటాయిస్తే అధిక జనాభా కలిగిన రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత స్థానాల సంఖ్య తగ్గకపోయినా, మొత్తం లోక్‌సభలో వాటి ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సహించిన జనాభా నియంత్రణ విధానాలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడితే అది ఎంతవరకు సమంజసం? అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు ప్రోత్సాహం అందించాల్సిన తరుణంలో వాటి రాజకీయ ప్రాధాన్యం తగ్గే పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుపై ప్రభావం : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు 25, తెలంగాణకు 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ సంఖ్యలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 153కు పెంచే అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ పెంపు రాజ్యాంగ నిబంధనలకు లోబడి అమలు కావాల్సి ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే స్థానిక నాయకత్వానికి కొత్త అవకాశాలు లభించడంతో పాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ వంటి మహానగరాలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల జనాభా మార్పులకు అనుగుణంగా నియోజకవర్గాల స్వరూపం మారవచ్చు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల కేటాయింపులోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

మహిళా రాజకీయ ప్రాతినిధ్యానికి కొత్త దిశ : నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్ల అమలు అంశం కూడా ముడిపడి ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 106వ రాజ్యాంగ సవరణ చట్టం అమలుకు జనగణన, తదనంతర డీలిమిటేషన్ ప్రక్రియ కీలకం. మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుంది. అయితే, రిజర్వేషన్ల అమలులో పారదర్శకత, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సమాఖ్య స్ఫూర్తిని కాపాడాల్సిందే : భారతదేశం విభిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు, సామాజిక పరిస్థితులతో కూడిన సమాఖ్య వ్యవస్థ. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రతి రాష్ట్రానికీ సముచిత ప్రాధాన్యం ఉండాలి. జనాభా ఆధారంగా ప్రజలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న వాదన ఎంత ముఖ్యమో, రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను కాపాడాలన్న వాదన కూడా అంతే ముఖ్యమైనది. జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య అవసరమే. అదే సమయంలో జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించడం కూడా సమాఖ్య వ్యవస్థ బాధ్యత. ఈ రెండు అంశాల మధ్య సమన్వయం సాధించేలా కేంద్రం విధివిధానాలను రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, రాజ్యాంగ నిపుణులు, ప్రజాసంఘాలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. అవసరమైతే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలి.

రాజకీయ ప్రయోజనాలకంటే ప్రజాస్వామ్య ప్రయోజనాలే ముఖ్యం : నియోజకవర్గాల పునర్విభజన వల్ల దేశంలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. రాజకీయ పార్టీల బలాబలాలు, ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో రాష్ట్రాల పాత్ర వంటి అంశాలపై దీర్ఘకాలిక ప్రభావం పడవచ్చు. అందువల్ల డీలిమిటేషన్ ప్రక్రియ ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రయోజనాలకో, ఏ ఒక్క ప్రాంత ఆధిపత్యానికో పరిమితం కాకూడదు. నియోజకవర్గాల సరిహద్దుల నిర్ధారణలో భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం, జనాభా నిష్పత్తి, సామాజిక సమీకరణాలు, ప్రజల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. స్వతంత్రత, నిష్పాక్షికత, పారదర్శకత ఈ ప్రక్రియకు మూలస్తంభాలుగా నిలవాలి.

పునర్విభజన ప్రజాస్వామ్య బలోపేతానికే కావాలి! : మారుతున్న జనాభా పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం అవసరమే. అయితే, ఆ ప్రక్రియ దేశ ఐక్యతకు, ప్రాంతీయ సమతుల్యతకు, సామాజిక న్యాయానికి విఘాతం కలిగించకూడదు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించే అంశాన్ని కేంద్రం పరిశీలించాలి. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం దాని ప్రతిపాదనలపై సమగ్ర చర్చ జరగాలి. రాష్ట్రాల ఆందోళనలకు కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. మెజారిటీ బలంతో నిర్ణయాలు తీసుకోవడం కంటే ఏకాభిప్రాయంతో ముందుకు సాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రేయస్కరం. డీలిమిటేషన్ అంటే కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చడం కాదు.. దేశ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడం. జనాభా సంఖ్యకు న్యాయం చేస్తూనే రాష్ట్రాల హక్కులకు రక్షణ కల్పించాలి. అభివృద్ధికి శిక్షగా కాకుండా ప్రజాస్వామ్యానికి మరింత బలాన్ని చేకూర్చే ప్రక్రియగా నియోజకవర్గాల పునర్విభజన నిలవాలి. అదే నిజమైన సమాఖ్య స్ఫూర్తి.

పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో 'పోస్టుల గారడీ'!

పరిపాలనా సౌలభ్యమా..లేక మార్పు వెనుక మరో కారణమా..?

కార్యాలయ నిర్వహణ కోసం ఉద్యోగులకు విధులు కేటాయించడం సాధారణ పరిపాలనా ప్రక్రియే. అయితే, ఒక కీలక రెవెన్యూ పోస్టులో పనిచేస్తున్న అధికారిని మరో పోస్టుకు ఇన్‌చార్జిగా మార్చి, అదే సమయంలో వేరొక ఉద్యోగికి ఆ బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న కారణాలను వివరించాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టు మండలంలోని భూముల పరిశీలన, రెవెన్యూ రికార్డుల పర్యవేక్షణ, క్షేత్రస్థాయి నివేదికలు, వివిధ భూ వ్యవహారాలకు సంబంధించిన కీలక బాధ్యతలతో ముడిపడి ఉంటుంది. అలాంటి పోస్టులో బాధ్యతల మార్పు జరిగినప్పుడు, దాని వెనుక ఉన్న పరిపాలనా అవసరాలను స్పష్టంగా వెల్లడించాలి. ప్రస్తుతం ఉన్న ఆర్ఐ తహశీల్దార్‌కు కొన్ని కీలక భూ వ్యవహారాల్లో సహకరించడం లేదనే ప్రచారం కూడా రెవెన్యూ ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆర్ఐని తాత్కాలికంగా మరో పోస్టుకు మార్చి, సీనియర్ అసిస్టెంట్‌ను ఆర్ఐ బాధ్యతల్లోకి తీసుకువచ్చారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ప్రచారానికి సంబంధించి అధికారిక నిర్ధారణ లేదు. సంబంధిత అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

తహశీల్దార్‌కు అధికార పరిధి ఎంత?

ఆంధ్రప్రదేశ్ పరిపాలనా నిబంధనలు, సర్వీస్ రూల్స్ ప్రకారం కార్యాలయ విధుల పంపిణీకి సంబంధించి తహశీల్దార్‌కు కొన్ని అధికారాలు ఉండవచ్చు. అయితే, వేర్వేరు పోస్టుల మధ్య అధికారిక ఇన్‌చార్జ్ బాధ్యతలను పరస్పరం మార్చడం, సంబంధిత పోస్టుల అధికారాలను అప్పగించడం వంటి అంశాలు నిర్దిష్ట నిబంధనలకు లోబడి ఉండాలి. ఈ నేపథ్యంలో పెందుర్తి తహశీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరస్పర ఇన్‌చార్జ్ నియామకాలకు తహశీల్దార్‌కు పూర్తి అధికార పరిధి ఉందా? ఈ నిర్ణయానికి సంబంధించి ఆర్డీఓ లేదా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారాల డెలిగేషన్ వివరాలు ఉత్తర్వుల్లో ఎందుకు పేర్కొనలేదు? కీలక భూ వ్యవహారాలు కొనసాగుతున్న సమయంలోనే ఈ బాధ్యతల మార్పు ఎందుకు చేపట్టారు? ఈ మార్పుల వల్ల భూముల రికార్డులు, ఫైళ్ల నిర్వహణపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తేనే బాధ్యతల మార్పు వెనుక ఉన్న పరిపాలనా కారణాలు స్పష్టమవుతాయి.

ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టాలి

పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ బాధ్యతల మార్పు వ్యవహారంపై రెవెన్యూ డివిజనల్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు, రెవెన్యూ వర్గాలు కోరుతున్నాయి. బాధ్యతల మార్పుకు సంబంధించిన ఫైల్ నోటింగ్స్, ఉత్తర్వుల నేపథ్యం, సంబంధిత భూముల రికార్డులు, పెండింగ్‌లో ఉన్న భూ వ్యవహారాలు, ఉద్యోగుల విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ నిర్వహించి, బాధ్యతల మార్పు నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? ఏదైనా వ్యక్తిగత లేదా ఇతర ప్రయోజనాల కోసం అధికార పరిధిని వినియోగించారా? అనే అంశాలను నిర్ధారించాలని కోరుతున్నారు. పరిపాలనా సౌలభ్యం పేరుతో తీసుకున్న నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా మారకూడదని, రెవెన్యూ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తారా? బాధ్యతల మార్పు వెనుక ఉన్న కారణాలను వెల్లడిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది

డీలిమిటేషన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం!

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలకు పరిష్కారంగా..

డీలిమిటేషన్ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోవచ్చన్న ఆందోళనలు గతంలో వ్యక్తమయ్యాయి. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజిస్తే కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పులు రావచ్చని రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలిపాయి. ఈ నేపథ్యంలో ఏ రాష్ట్రానికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య వాటా తగ్గకుండా అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే ప్రతిపాదనను కేంద్రం తీసుకొచ్చింది.

2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన

కొత్త ప్రతిపాదనలో నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే రాష్ట్రాల మధ్య లోక్‌సభ స్థానాల ప్రస్తుత నిష్పత్తిని మాత్రం 2051 వరకు కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

డీలిమిటేషన్ ప్రతిపాదనతో పాటు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం కొత్త బిల్లులో చేర్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన గత బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మద్దతు పొందలేక ఆమోదం పొందలేదు. దీంతో తాజా మార్పులతో మరోసారి బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

నవంబర్ 30 నుంచి ప్రత్యేక సమావేశాలు

ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. నవంబర్ 30న లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానుండగా, డిసెంబర్ 2 నుంచి రాజ్యసభ సమావేశం కానుంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు కేంద్రం ప్రయత్నించనుంది. అయితే క్యాబినెట్ ఆమోదం పొందడం మాత్రమే చట్టంగా మారినట్లు కాదు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది.

ఈ బిల్లు ఆమోదం పొందితే లోక్‌సభలో రాష్ట్రాల వారీగా స్థానాల సంఖ్య పెరగడంతో పాటు మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా మార్గం సుగమమయ్యే అవకాశం ఉంది. అయితే బిల్లులోని పూర్తి నిబంధనలు, రాష్ట్రాల వారీగా పెరిగే స్థానాల వివరాలు పార్లమెంట్ ముందుకు వచ్చిన తర్వాత మరింత స్పష్టత రానుంది

అమెరికాను ముంచెత్తిన వరదలు, మంచు తుపాను

- మొదటి పేజి తరువాయి

పెనుగా లులు, ఆకస్మిక వరదలు, దట్టమైన మంచు తుపానులతో దేశంలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా అమెరికా తూర్పు తీర రాష్ట్రాలపై తుపాను ప్రభావం తీవ్రంగా పడింది. ఈ విపత్తు కారణంగా దాదాపు 10 లక్షల ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల అమెరికావ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. 2,200 కంటే ఎక్కువ విమాన సర్వీసులు ఆలస్యంగా నడవగా, 400కి పైగా విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. రోడ్లు, రైలు మార్గాలు సైతం వరద నీటిలో మునిగిపోయాయి.న్యూయార్క్ నగరంలో ఏటా అట్టహాసంగా నిర్వహించే ప్రపంచ ప్రఖ్యాత 'మేసీస్ థాంక్స్ గివింగ్ డే పరేడ్' చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వాయిదా పడింది. వీధుల్లో తిరిగే భారీ బెలూన్లకు బలమైన గాలుల వల్ల ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు ఈ పరేడ్‌ను శనివారానికి వాయిదా వేశారు. ఈ వార్షిక వేడుక ఇలా వాయిదా పడటం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు వరదల తీవ్రత దృష్ట్యా న్యూజెర్సీ, న్యూయార్క్‌లలోని పలు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ విధించారు. న్యూజెర్సీలోని అవలోన్, ఓషన్ సిటీలలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. రోడ్లు జలమయం కావడంతో కార్లలో చిక్కుకుపోయిన అనేకమందిని సహాయక బృందాలు రక్షించాయి. నార్త్ కరోలినా నుంచి దక్షిణ న్యూ ఇంగ్లాండ్ వరకు తీవ్ర ప్రభావం పడగా, చెసాపీక్ బే బ్రిడ్జ్-టన్నెల్, ఎన్‌సీ 12 ప్రధాన రహదారులను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. మేరీల్యాండ్‌లో విద్యుత్ సమస్యల కారణంగా దాదాపు 20 లక్షల మందికి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మిడ్‌వెస్ట్ రాష్ట్రాలైన ఇల్లినాయిస్, మిస్సోరీలలో భారీగా మంచు కురిసింది. మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో 7.3 అంగుళాలు, సెయింట్ జెనెవీవ్‌లో 14 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది.

వెంట్జ్‌విల్లేలో ఒక ఐస్ అరేనా పైకప్పు మంచు ధాటికి కుప్పకూలింది. అలాగే, పశ్చిమ తీరంలోని కాలిఫోర్నియాలో భారీ అలలు, కెరటాల తీవ్రతకు తీర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పసిఫికా పీర్ కొంత భాగం సముద్రంలో కూలిపోగా, రైలు పట్టాలు దెబ్బతినడంతో ఆమ్‌ట్రాక్ పసిఫిక్ సర్ఫ్‌లైనర్ సేవలను నిలిపివేశారు.

ఈ విపత్తుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఫ్లోరిడా వరదలకు సంబంధించి ఇప్పటికే డిజాస్టర్ డిక్లరేషన్‌పై సంతకం చేశామని, తూర్పు తీర తుపాను నష్టంపై ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలిస్తామని వెల్లడించారు. తీవ్రమైన గాలులు, రాకాసి అలలు, వరదల కలయికతో లక్షలాది మంది ప్రజల పండుగ ఉత్సాహం నీరుగారిపోయింది.

దీపం వెలిగించాల్సిందే

- మొదటి పేజి తరువాయి

వెలిగించాలని ఆదేశించింది. ఉచ్చిపిళ్లైయార్ మండపం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జ్యోతితోనే ఈ దీపాన్ని వెలిగించాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ ట్రస్టీల బోర్డును సుప్రీంకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. ఆలయ పరిపాలన, నిర్వహణ బాధ్యతలను సజావుగా నడిపించేందుకు మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్‌లను రిసీవర్లుగా నియమించింది. అంతేకాకుండా, ఆలయం మరియు కొండ పరిసర ప్రాంతాల భద్రతను కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలకు (సీఆర్‌పీఎఫ్) అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీపత్తూన్‌పై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ నవంబర్ 20న ఇచ్చిన మునుపటి ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఆదేశాలను ఉల్లంఘించి, దీపత్తూన్‌పై కాకుండా కేవలం ఉచ్చి పిళ్లైయార్ ఆలయం సమీపంలోని దీప మండపం వద్దే దీపం వెలిగించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడాన్ని ఉపేక్షించబోమని, ఇలాంటి వైఖరిని ఉక్కుపాదంతో అణచివేయాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది.

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మధురై జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది.తిరుపరంకుండ్రం కొండపై కార్తీక దీపాన్ని ఏ ప్రదేశంలో వెలిగించాలనే అంశంపై ఆలయ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ఈ కీలక తీర్పును వెలువరించింది.

హసీనా ఓ 'ముల్లు'లా మారారు - బంగ్లాదేశ్

- మొదటి పేజి తరువాయి

స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలపై భారత్ ఆచితూచి స్పందించిన నేపథ్యంలో బంగ్లా ఈ విధంగా స్పందించింది."బంగ్లా-భారత్ సంబంధాల్లో హసీనా ఓ ముల్లులా తయారయ్యారు. ఆమె వ్యవహారం చికాకుగా మారింది. భారత్ కూడా ఇదే విధంగా భావిస్తోంది. హసీనా ఓ నేరస్థురాలు. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందంలో భాగంగానే ఆమె స్వదేశానికి వస్తారు. చేతులకు సంకెళ్లు లేదా కట్టుదిట్టమైన భద్రత నడుమే ఆమె తిరిగి రావాల్సి ఉంటుంది" అని బంగ్లా విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ పేర్కొన్నారు.షేక్ హసీనా వ్యవహారంపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ ఇటీవల స్పందిస్తూ.. ఆమె స్వయంగా బంగ్లాకు వెళ్లాలనుకోవడం, ఆమె అప్పగింతపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తిని వేర్వేరుగా చూస్తున్నామన్నారు. ఆమెను అప్పగించేందుకు ఉన్న న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.

ఉన్నది ఒక్కటే జీవితం.. సార్థకం చేసుకోండి..

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో చిరంజీవి పాల్గొని మాట్లాడారు. జీవితాన్ని సార్థకం చేసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని అన్నారు."48 సంవత్సరాల కిందట 22 ఏళ్ల ప్రసాద్ అనే యువకుడిగా హీరో అవ్వాలనే జీవిత లక్ష్యంతో చెన్నై ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో అడుగు పెట్టా. రోజూ సాయంత్రం పాండీ బజార్‌లో సరదాగా తిరగడానికి సినీ రంగానికి చెందిన చిన్నా చితక ఆర్టిస్టులంతా వస్తారు. మొదటిసారి స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు అక్కడికి వెళ్లా. 'ఎవడ్రా ఈ అబ్బాయి' అని అందరూ నా వైపు వింతగా చూశారు. 'యాక్టర్ అవుదామని ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అయ్యాడు' అని నా ఫ్రెండ్ చెప్పాడు. 'ఒక బీర్ ఇవ్వండి మనోడికి.. భయమంతా పోతుంది' అన్నారు. సినిమా ఇండస్ట్రీలో ఇవన్నీ మామూలే. తాగాలని ఒత్తిడి చేస్తారు. వద్దని చెబుతూ ఇబ్బందికరంగా అక్కడి నుంచి వెళ్లిపోయాను. మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లకూడదనుకుని నిశ్చయించుకున్నా. అదే సమయంలో ఓ పెద్ద మనిషి తారసపడి 'నటుడు అవ్వాలన్న నీ లక్ష్యంవైపే అడుగు వేయ్' అని సలహా ఇచ్చారు. అలా అన్నీ దాటుకుని వచ్చాను కాబట్టే ఇప్పుడు మెగాస్టార్‌గా

కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనం సర్పంచుల విజయాలు

- గ్రామాభివృద్ధికి నూతన సర్పంచులు కృషి చేయాలి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 27:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాలకు చెందిన పలువురు నూతన సర్పంచులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయానందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సర్పంచులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు ఉన్న అపారమైన విశ్వాసానికి ఈ విజయాలే నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధిలో నూతన సర్పంచులు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఏకగ్రీవ సర్పంచ్ లకు ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందన



- నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి సర్పంచ్ గుంజి సాయమ్మతో పాటు వార్డు సభ్యులు

పెన్ పవర్ నవంబర్ 27 నెల్లూరు జిల్లా బ్యూరో

మనుబోలు మండలం కొలనకుదురు సర్పంచ్ గా ఎన్నికైన ఆత్మకూరు నాగమణితో పాటు వార్డు సభ్యులను కూడా అభినందించిన సోమిరెడ్డి వీరితో పాటు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ లు, వార్డు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పంచాయతీ పాలకవర్గాలు ఏకగ్రీవం కావడంలో కీలకపాత్ర పోషించిన ఆయా గ్రామాల నాయకులను ప్రత్యేకంగా అభినందించిన సోమిరెడ్డి



మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు జన్మదిన శుభాకాంక్షలు

తెలిపిన , బలిజ సంఘం ప్రెసిడెంట్, టెక్స్‌మో శివ ప్రదీప్, ఒబ్బు సురేష్ కుమార్

నాయుడుపేట నవంబర్27 పెన్ పవర్ ప్రతినిధి



సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ నెలవలసుబ్రహ్మణ్యంజన్మదినాన్ని పురస్కరించుకుని టెక్స్‌మో అధినేత, నాయుడుపేట బలిజ సంఘం ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్, వెజిటేబుల్ మార్కెటింగ్ కమిటీ నేత ఓబు సురేష్ కుమార్ ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో టెక్స్‌మో అధినేత, బలిజ సంఘం ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్, ఓబు సురేష్ కుమార్ పాల్గొని భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నెలవల సుబ్రహ్మణ్యం అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడుతూ, భగవంతుడి ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్

రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

'ప్రజల మధ్యకు ప్రజాప్రతినిధులు.

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈవినింగ్ వాక్ విత్ కార్పొరేటర్ విజయలక్ష్మి.

నెల్లూరు నవంబరు 27(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయాలనే సంకల్పంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవినింగ్ వాక్ విత్ కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా 21వ డివిజన్ కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి, జనసేన నాయకులు కిషోర్ గునుకుల రామ్మీ నగర్‌లోని 4, 5, 7, 8వ వీధుల్లో శుక్రవారం పర్యటించారు.నెల్లూరు నగరంలో ప్రతిరోజూ కనీసం ఒక గంటసేపు ప్రజాక్షేత్రంలో గడుపుతూ, స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా వీధుల్లో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సూచిస్తున్న రాజకీయ జవాబుదారీతనం, పారదర్శక పాలన స్ఫూర్తితో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా పనిచేస్తామని తెలిపారు.



అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీ పొంగూరు నారాయణ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తోడుగా నిలుస్తూ, నగర అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.,,ప్రజల సమస్యలను వినడం మాత్రమేకాదు వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండటమే నిజమైన రాజకీయ జవాబుదారీతనం,,అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగింది.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, 21వ డివిజన్ కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి, ప్రశాంత్ గౌడ్, బాలాజీ, ఆమని, విజయ,శ్రీలక్ష్మి, నరహరి, మల్లారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, ప్రతాప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూడేరు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా సర్పంచ్ అభ్యర్థి బత్తల వెంకటేష్.

-పూడేరు పంచాయతీ అభివృద్ధికి పలు హామీలతో ప్రచారం.
-ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంటూ ముందడుగు.
-బుట్ట గుర్తుపై ఓటు వేసి గెలిపించండి.
-సులూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ.

నాయుడుపేట. నవంబర్27 నేటిమనదేశమ్ ప్రతినిధి



నాయుడుపేట మండలం పూడేరు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బత్తల వెంకటేష్ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సులూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బలపర్చిన తెలుగుదేశం పార్టీ పూడేరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి బత్తల వెంకటేష్ ని గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ శ్రీ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ కూడేరు గ్రామపంచాయతీ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారం,విధి దీపాల ఏర్పాటు,సిమెంటు రోడ్ల నిర్మాణం,కాలనీల అభివృద్ధి, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తారని స్థానిక ఓటర్లకు ఎమ్మెల్యే తెలియజేశారు.

అలాగే కూడేరు గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మీ అందరి సహకారం అవసరమని కోరుతూ "బుట్ట గుర్తుకు" మీ అమూల్యమైన ఓటును వేసి టిడిపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఎంపీపీ నెలవల రాజేష్,మండల అధ్యక్షులు కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అరవ పెనిమిటి సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

అండర్17 క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన ప్రొద్దుటూరు యువకుడు సాద్ ఇర్ఫాన్ కు ఘన సన్మానం



ప్రొద్దుటూరు నవంబర్27 పెన్ పవర్ ప్రతినిధి.

ప్రొద్దుటూరు: క్రికెట్ క్రీడారంగంలో ప్రతిభను చాటుకుని అండర్17 క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో పాటు, జట్టు వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొద్దుటూరుకు చెందిన యువ క్రీడాకారుడు సాద్ ఇర్ఫాన్ ను అభినందిస్తూ ఉపాధ్యాయ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.14 ఏళ్లకే జాతీయ జట్టుకు వరుసగా మూడవ సారి అర్హత సాధించిన సాద్ ఇర్ఫాన్ ను ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒలింపిక్ అసోసియేషన్ చైర్మెన్ ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల, కృషి, క్రీడా నైపుణ్యంతో ఉన్నత స్థాయికి ఎదుగుతూ ప్రొద్దుటూరు పట్టణానికి గర్వకారణంగా నిలిచిన యువ క్రీడాకారుడిని సత్కరించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాద్ ఇర్ఫాన్ తండ్రి ఇర్ఫాన్ బాషా డి. భాస్కర్ రావు వాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ టి డి వరుణ్ కుమార్ రెడ్డి, కోచ్ అహ్మద్ భాషా, అండర్ 19 వినోద్ మన్కడ్ ట్రోఫీ ప్లేయర్ జి.గైబు, వెటరన్ క్రికెటర్ గోవింద్ మోరే, కూరపాటి శ్రీనివాసుల రెడ్డి, గురు స్వామి, సూరారెడ్డి, పుల్లారెడ్డి, మధు, మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీను, గురివిరెడ్డి, కరీముల్లా, ఒంటేరు భాస్కర్ రెడ్డి, పంజగల మధు సూధన్ బాబు, సుధాకర్, రిజ్వాన్ ఇతర ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, క్రీడాభిమానులు, పట్టణ ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాజధానిలో ఎఫ్ఎస్ఐ (FSI) పెంపుపై మంత్రి నారాయణ సమీక్ష

- రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా ఎఫ్ఎస్ఐ పెంపునకు ప్రభుత్వ కసరత్తు
- పెంపు ఎంతమేరటి ఉండాలనే అంశంపై అధికారులతో చర్చ
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం

పెన్ పవర్ నవంబర్ 27 స్టేట్ బ్యూరో



రాజధాని అమరావతిలో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (FSI) పెంపునకు సంబంధించి రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. సీఆర్డీఏ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి.. రాజధాని పరిధిలో ఎఫ్ఎస్ఐని ఎంతమేర పెంచాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు.

రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యత

రాజధాని ప్రాంతంలో ఎఫ్ఎస్ఐ పెంపు ద్వారా భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలు, అభివృద్ధి అవకాశాలకు సంబంధించి ఇప్పటికే రాజధాని ప్రాంత రైతులతో మంత్రి నారాయణ చర్చించారు. ఎఫ్ఎస్ఐ పెంపుపై రైతుల అభిప్రాయాలను, వారి సూచనలను స్వయంగా తెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వాటికి అనుగుణంగా ఎఫ్ఎస్ఐ పెంపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అధికారులతో వివిధ అంశాలపై చర్చ

ఈ నేపథ్యంలో సీఆర్డీఏ టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎఫ్ఎస్ఐ పెంపునకు సంబంధించిన వివిధ అంశాలను మంత్రి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనలు, పెంపు వల్ల కలిగే ప్రయోజనాలు, రాజధాని భవిష్యత్ అవసరాలు, రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఎఫ్ఎస్ఐని ఎంతమేర పెంచాలనే అంశంపై అధికారుల నుంచి వివరాలు, ప్రతిపాదనలు తెలుసుకున్నారు.

ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం

రాజధాని అమరావతి భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఎఫ్ఎస్ఐ పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించిన అనంతరం ఎఫ్ఎస్ఐ పెంపు ఎంతమేర ఉండాలనే దానిపై మంత్రి నారాయణ తుది నిర్ణయం తీసుకోనున్నారు.

తమిళనాడులో ఓ కీచక ఎమ్మెల్యే లైంగిక వేధింపుల



పెన్ పవర్ నవంబర్ 27 స్టేట్ బ్యూరో

బండారం బట్టబయలు అయింది. అతడు వేధింపుల బారిన పడ్డ మహిళ ఎవరో కాదు.. సాక్షాత్ జిల్లా కలెక్టర్. దీంతో ఇప్పుడు అధికార పార్టీ టీవీకే ఇరకాటంలో పడింది. ముఖ్యమంత్రి విజయ్ కు సంకట ఈ సమస్యగా మారింది. కలయికురుచ్చి జిల్లా కలెక్టర్ పద్మజకు, అరుల్ విగ్నేష్ అనే ఓ ఎమ్మెల్యే జ నేరుగా మెసేజ్ లు పెట్టడం మొదలు పెట్టాడు. మీరు చాలా బాగుంటారు, చీరగట్టితే బాగుంటుంది, మీ హెయిర్ స్టైల్ బాగుంటుంది, మీ మాట బాగుంటుంది.. అంటూ మెసేజ్ లు పెట్టడం మొదలు పెట్టడంతో జిల్లా కలెక్టర్ నేరుగా హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు అతడు పై మహిళా వేధింపుల చట్టం కింద కేసు కూడా నమోదయింది. హైకోర్టు కూడా ప్రభుత్వం న్యాయవాదిని పిలిపించి , ఈ కేసు విషయమై సమగ్రమైన నివేదిక తమకు అందించాలని ఆదేశించింది. ప్రతిపక్ష డిఎంకె పార్టీ నాయకుడు స్టాలిన్ కూడ తీవ్ర స్థాయిలో స్పందించారు. విజయ్ ప్రభుత్వంలో జిల్లా మహిళా జిల్లా కలెక్టర్ కె రక్షణ లేకపోతే ఇక సాధారణ మహిళల పరిస్థితి ఏంటి అని ఆయన నిలదీశారు. ఇప్పుడు ఈ ఉదంతంపై తమిళనాడులో రాజకీయ దుమారం రాజుకుంది. ఎమ్మెల్యే అరుల్ విగ్నేషన్ పై ఏమి తీసుకుంటారో చూడాల్సి ఉంది...

గూడూరులో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..



గూడూరు నవంబర్ 27 పెన్ పవర్ ప్రతినిధి.

గూడూరు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ గారితో కలిసి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి గారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తమ అభ్యర్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు



- రూ.5 వేల ఆర్థిక సాయం.. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 27:

పెద్దదిక్కును కోల్పోయి ఆపన్న స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఓటేరు కాలువ ప్రాంతానికి చెందిన సూరి అలియాస్ బాబి (40) గూడూరు రైల్వే స్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తుండగా గుండెపోటుతో మృతి చెందడంతో, ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ కోటేశ్వరబాబు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, భార్య లావణ్యకు కర్మక్రియల నిమిత్తం రూ. 5 వేల నగదు అందజేశారు. అంతేకాకుండా రెండు నెలలకు సరిపడా 26 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, తల్లీపిల్లలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పిల్లల చదువులకు భవిష్యత్తులోనూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సాయం అందించడమే కాకుండా, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించిన డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు సేవానిరతిని స్థానికులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి





- బాలికల హక్కులు, విద్య, భద్రతపై విద్యార్థులకు అవగాహన

ఏర్పేడు, పెన్ పవర్, నవంబర్ 27:

అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల హక్కులను హరించే తీవ్రమైన సామాజిక సమస్యని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు విద్యకు దూరమవడమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, గృహహింస, ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం వివరించారు.

అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకుసమాచారం అందించి అడ్డుకోవాలని పోలీస్ కానిస్టేబుల్ కవిత కోరారు.

ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, హక్కుల పరిరక్షణపైవిద్యార్థులకు అవగాహన కల్పించి, బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, పోలీస్ కానిస్టేబుల్ కవిత, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ప్రగతి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కొనతనేరి గ్రామంలో కోవి శిరీష విజయకేతనం



- 116 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం.. ప్రత్యర్థులకు షాక్

తొట్టంబేడు, పెన్ పవర్, నవంబర్ 27:

మండలంలోని కొనతనేరి గ్రామంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో కోవి శిరీష తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. గ్రామ ప్రజల విశేష ఆదరణ, అఖండ మద్దతుతో 116 ఓట్ల భారీ మెజారిటీ సాధించి ఘన విజయం నమోదు చేశారు. ఈ విజయంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

విజయం సాధించిన కోవి శిరీషకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు అభినందనలు వెల్లువెత్తించారు. తనపై నమ్మకం ఉంచి అఖండ విజయాన్ని అందించిన గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రజల ఆదరణే తన విజయానికి అసలైన బలమని పేర్కొన్నారు.

పిండి మిల్లులో చోరీ.. బాధితుడికి దండి నరేంద్ర పరామర్శ





- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి

ఏర్పేడు, పెన్ పవర్, నవంబర్ 27:

ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామంలోని పిండి మిల్లులో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి విద్యుత్ వైర్లు, విలువైన సామగ్రి, బరువు కొలిచే యంత్రాలను అపహరించారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

విషయం తెలుసుకున్న జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర బాధితుడు రామకృష్ణను పరామర్శించి ధైర్యం చెప్పారు. అప్పులు చేసి మిల్లు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి జరిగిన నష్టం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితుడికి న్యాయం చేయాలని ఏర్పేడు పోలీసులను కోరారు.

నీతి ఆయోగ్ సభ్యురాలు డాక్టర్ జోరామ్ అనియా శ్రీకాళహస్తి సందర్శన



- శివసన్నిధిలో ప్రత్యేక దర్శనం.. ఘనంగా ఆధ్యాత్మిక స్వాగతం

శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,నవంబర్ 27:

నీతి ఆయోగ్ పూర్తికాల సభ్యురాలు, ప్రముఖ విద్యావేత్త, పరిశోధకురాలు, జానపద రచయిత్రి డాక్టర్ జోరామ్ అనియా శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, పండితులు పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులతో ఆమెకు శుభం కలగాలని ఆలయ వర్గాలు ఆకాంక్షించాయి.

పాఠశాల పక్కనే మురుగునీటి కలకలం

- బిర్యానీ సెంటర్ వ్యర్థ జలాలతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు..



శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 27:

శ్రీకాళహస్తి పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న బిర్యానీ సెంటర్ నుంచి వెలువడుతున్న మురుగునీటిని 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై వదిలేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల సమీపంలోనే ఇటువంటి పరిస్థితులు నెలకొనడం విద్యార్థుల ఆరోగ్యానికి, పరిసరాల పరిశుభ్రతకు ఆందోళన కలిగిస్తోంది.

బిర్యానీ సెంటర్ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సూళ్ళూరుపేట సీఐ ఎం. మురళీకృష్ణ ఉక్కుపాదం..



- స్థానికేతరులు తక్షణమే గ్రామాలు వీడాల్సిందే!

- రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలకు సీఐ స్ట్రాంగ్ వార్నింగ్

సూళ్ళూరుపేట: నవంబర్27 పెన్ పవర ప్రతినిధి

సూఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 29న (ఆదివారం) జరగనున్న నేపథ్యంలో సూళ్ళూరుపేట, తడ మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై సూళ్ళూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. మురళీకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, నాయుడుపేట డీఎస్పీ జి. చెంచుబాబు ఆధ్వర్యంలో ఎన్నికల నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తున్నట్లు సీఐ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం–1994లోని సెక్షన్ 214 ప్రకారం, పోలింగ్ ముగియడానికి 44 గంటల ముందు నుంచే (శుక్రవారం, నవంబరు 27 సాయంత్రం 5 గంటల నుండి) బహిరంగ ప్రచారానికి తెరపడిందని ఆయన వెల్లడించారు. పోలింగ్ ముగిసే వరకు బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, మైకులు (లౌడ్ స్పీకర్లు), కచేరీలు, నాటకాలు, ఇతర వినోద కార్యక్రమాలపై పూర్తి నిషేధం అమల్లో ఉంటుందన్నారు. అలాగే టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఎలాంటి ప్రచారం చేయరాదని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తమ సోషల్ మీడియా ఖాతాల్లోని ఎన్నికల ప్రకటనల లింకులను తక్షణమే 'ప్రైవేట్ మోడ్'లోకి మార్చుకోవాలని సీఐ ఆదేశించారు.

సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్లు కాని అభ్యర్థులు, రాజకీయ నాయకులు,కార్యకర్తలు, మద్దతు దారులు, ప్రచారకులు తక్షణమే ఆ ప్రాంతాలను విడిచి వెళ్లిపోవాలని, ఎవరికి వారు తమ సొంత గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉండాలని సీఐ ఎం. మురళీకృష్ణ పోలీసు నోటీసుల ద్వారా హెచ్చరించారు.

ఇతర గ్రామ పంచాయతీల పరిధిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించరాదని, స్థానికేతరుల కదలికలను అడ్డుకునేందుకు పంచాయతీ సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో పాటు హోటళ్లు, లాడ్జీలు, కమ్యూనిటీ హాళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రెండు మండలాల్లోని రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా లేదా అల్లర్లకు పాల్పడినా ఏపీ పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 214తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఓటర్లందరూ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా శాంతియుతంగా, సజావుగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ ఎం. మురళీకృష్ణ పిలుపునిచ్చారు.

మాకు ఓటు వెయ్యండీ అభివృద్ధి చేసి చూపిస్తా పల్లేటి శారద.

నాయుడుపేట తిమ్మాజికండ్రిగ నవంబర్27

పెన్ పవర్ ప్రతినిధి.



తిమ్మాజికండ్రిగ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పల్లేటి శారద తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆమె కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్నారు.

ఈ సందర్భంగా గ్రామ ఓటర్లను ఉద్దేశించి ప్రత్యేకంగా ముద్రించిన ప్రచార పత్రాల ద్వారా తనకు మద్దతు తెలపాలని గ్రామంలో మాజీ సర్పంచ్ పాలెటి రమణయ్య తెలుగు దేశం పార్టీ తరపన ప్రచారంలో పాల్గొని మన గ్రామంలో అన్ని వసతలు ఏర్పాట్లు పై ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటరు మహాశయులందరూ తమ అమూల్యమైన ఓటును కత్తెర గుర్తుపై వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పల్లేటి శారద కోరుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, గ్రామ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రతి ఓటరు పాత్ర కీలకమని ఆమె విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంటున్న నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పల్లేటి శారద తన ఎన్నికల గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కత్తెర గుర్తుతో ప్రచార పత్రాలను పంపిణీ చేస్తున్నారు.

ఈ ఎన్నికల పోలింగ్ నవంబర్ 29, 2026 ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రచార పత్రంలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ లొ కత్తెర గుర్తు కి ఓటు వెయ్యాలని వారు కొరారు

786 రఫీపై నిరాధార ఆరోపణలు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు



- వైఎస్ఆర్‌సీపీ నాయకుడు పాలేటి నాగార్జునపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడి విజ్ఞప్తి

నాయుడుపేట, నవంబర్ 27: పెన్ పవర్ ప్రతినిధి.

నాయుడుపేట పట్టణానికి చెందిన 786 సేవా సంస్థ నిర్వాహకుడు 786 రఫీపై అసత్యమైన, నిరాధారమైన ఆరోపణలు చేస్తూ వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, 3వ వార్డు కౌన్సిలర్ పాలేటి నాగార్జునపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళ్ళూరి వెంకయ్య నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. నాయుడుపేట పట్టణంలో 786 సేవా సంస్థను స్థాపించి అనేక సంవత్సరాలుగా పేదలకు, నిరుపేదలకు, ఆపదలో ఉన్న ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ 786 రఫీ ప్రజల మన్ననలు పొందారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. సామాజిక సేవతో పాటు రాజకీయ, వ్యాపార రంగాల్లోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు.

అయితే ఈ నెల 26వ తేదీన పాలేటి నాగార్జున కొంతమంది వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించి 786 రఫీపై అసత్యమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వల్ల ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠకు, రాజకీయ జీవితానికి, సామాజిక గౌరవానికి భంగం కలిగిందని పేర్కొన్నారు.

ప్రజల మధ్య మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తిపై రాజకీయ కక్షతో వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఫిర్యాదుదారుడు అభిప్రాయపడ్డారు. ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రెస్‌మీట్‌కు సంబంధించిన వీడియోలు, ఆడియోలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైన పోస్టులు, ఇతర ఆధారాలను సేకరించి విచారణ జరపాలని పోలీసులను కోరారు. ప్రాథమిక విచారణలో నేరం జరిగినట్లు తేలితే చట్టాల ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భవిష్యత్తులో ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు పునరావృతం కాకుండా చూడాలని, తన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మంగళ్ళూరి వెంకయ్య పోలీసులను కోరారు. ఆయనతోపాటు షరీఫ్ వెంకటేష్ .సతీష్. షరీఫ్. ముడూరు శేఖర్. ఉదయ రెడ్డి పలువురు పాల్గొన్నారు

కారుణ్య నియామకంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా విధుల కేటాయింపు

నెల్లూరు నవంబరు 27(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

నెల్లూరు నగర పాలక సంస్థ ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో అటెండర్, పబ్లిక్ హెల్త్ విభాగంలో వర్కర్ గా విధులు నిర్వహిస్తూ మరణించిన దార్ల మల్లి, ఇత్తడి రమేష్ ల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా కారుణ్య నియామకం ద్వారా వారి కుటుంబ సభ్యులు దార్ల కళ భర్త లేట్ మల్లి ఇత్తడి సతీష్ తండ్రి లేట్ రమేష్ లకు పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా విధులను కేటాయిస్తూ ఉత్తర్వులను గౌరవ మేయర్ రూప్ కుమార్ యాదవ్ శుక్రవారం అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయం మేయర్ ఛాంబర్ లో శుక్రవారం కారుణ్య నియామకం పత్రాలను వారు మేయర్ నుంచి అందుకున్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణప్రదర్శిస్తూ,బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మేయర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మేనేజర్ రాజేశ్వరి, పబ్లిక్ హెల్త్ విభాగం సూపరింటెండెంట్ విజయ పాల్గొన్నారు.



రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

గుంటూరు,పెన్ పవర్,నవంబరు 27 :

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల విధుల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు విధులను కేటాయించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియుజిల్లాఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ,వివరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ జిల్లా అధికారి మోహన రాగిని పాల్గొన్నారు.



భీమగానిపల్లె పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తా. సర్పంచ్ అభ్యర్థి వెంకటప్రసాద్

పెన్ పవర్, నవంబర్, 27,

పుంగనూరు మండలంలోని భీమగానిపల్లె పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని భీమగానిపల్లె, గుట్టపల్లి, బోడినాయనపల్లి, ఉలవలదిన్నె, రాంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి వెంకటప్రసాద్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సర్పంచ్ పదవి జనరల్ కేటగిరీకి రాలేదని, ప్రస్తుతం వచ్చిన అవకాశంతో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన తాత స్వాతంత్ర్య సమరయోధుడని, పుంగనూరు తొలి శాసనసభ్యుడు దివంగత బాడాల కృష్ణమూర్తిరావు మనవడిగా, స్థానికుడిగా ప్రజల ఆదరణపై నమ్మకం ఉందన్నారు. ప్రచారంలో గ్రామాల్లోని తాగునీటి సమస్య, సీసీ రహదారులు, శ్మశానవాటికకు రహదారి వంటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తనను అఖండ మెజారిటీతో గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని గ్రామాభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. క్రమ సంఖ్య 4, బుట్ట గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, హేమంత్, జగదీష్, అరుణ్, వేమారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు

బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మిద్దాం..కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 27,

జిల్లాలో బాల్య వివాహాలను బాగా కట్టడి చేస్తున్నామని.. మరింత సమష్టి కృషితో సామాజిక బాధ్యతగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత శాఖ బాలల పరిరక్షణ విభాగం, జస్ట్ రైట్స్, అసోసియేషన్ ఫర్ వలంటరీ యాక్షన్, చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనకు చేయీచేయీ కలుపుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. చట్టాల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరిక ప్రచార సామగ్రిని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ, బాలికల విద్య, సాధికారతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, వారి విద్యాభ్యాసం, వ్యక్తిగత అభివృద్ధి, భవిష్యత్తు అవకాశాలకు ఆటంకం కలిగిస్తాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు దేశానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని



పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు, బాల్య వివాహాల వల్ల ప్రభావితమయ్యే వారికి చట్టపరమైన రక్షణలు కల్పించేందుకు బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 అమల్లో ఉందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనకు కమిషన్ విశేష కృషిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని గొప్ప ఉద్యమంగా తీసుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అవిద్య, ఆర్థిక పరిస్థితులు, అవగాహన లేమి, అభద్రత వంటివి బాల్య వివాహాలకు కారణమవుతున్నాయని.. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి కమిటీలు మొదలు ప్రతిఒక్కరూ క్రియాశీలం కావాలన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి.. బాల్య వివాహాల నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల విశేష



కృషితో పాటు వివిధ అధ్యయనాల్లోని ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడం, వారి హక్కులను గౌరవించడం, ఆత్మవిశ్వాసంతో ఎదిగేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణ బాబు, జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ, అరవ రమేష్ (ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్), నవభారతి (బాలికల అభివృద్ధి అధికారి), వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శనీయం..కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 27,

తత్వజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే రీతిలో కీర్తనలు, రచనల ద్వారా అందించిన ప్రముఖ తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

భక్త కనకదాస జయంతినిపురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరై కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనకదాస రచించిన రామధ్యాన చరిత్ర, మోహన తరంగిణి వంటి ప్రముఖ రచనలు విశేష ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన జీవితాన్ని, బోధనలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సమాజంలో కుల వివక్షను రూపుమాపడంలో భక్తకనకదాసరచనలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ఉచిత హోమియో వైద్య శిబిరం ప్రజలు ప్రభుత్వ హోమియో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ దాసరి చంద్రశేఖర్

బాపట్ల, నవంబర్ 27, (పెన్ పవర్) :

బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో శుక్రవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్, జిల్లెలమూడి ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ ఐనాపురపు భువనేశ్వరి పాల్గొని రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాపట్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతి



శుక్రవారం నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, సిబ్బంది నవనీతం, రాజేష్, సిఫోరా, లావణ్య, ప్రియాంక, రామరాజు, కాంపౌండర్ డి. విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏ.పీ.ఎస్.హెచ్.ఆర్.సి చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

గుంటూరు, పెన్ పవర్,నవంబరు 27 :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏ.పీ.ఎస్.హెచ్.ఆర్.సి) చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శుక్రవారం గుంటూరు అటవీ శాఖ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టును ఈ నెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఈ క్యాంపు కోర్టులో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం,మార్కాపురం జిల్లాలకు సంబంధించి హెచ్ఆర్సీ వద్ద నమోదైన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల



విచారణలతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి నూతన కేసుల స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు విద్యుత్ శాఖ అధికారుల సత్కారం

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 27 :



చిలకలూరిపేట పురపాలక సంఘ నూతన చైర్‌పర్సన్ తోట రాజరాజేశ్వరి, వైస్ చైర్మన్ కొత్త కుమారిలను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈసందర్భంగామున్సిపల్‌కార్యాలయంలో వారికిపుష్పగుచ్ఛాలుఅందజేసి, శాలువాలతో ఘనంగాసత్కరించి శుభాకాంక్షలుతెలిపారు.అనంతరం చైర్‌పర్సన్ తోట రాజరాజేశ్వరి మాట్లాడుతూ పట్టణప్రజలకుఎలాంటి విద్యుత్‌అంతరాయాలు,సమస్యలుతలెత్తకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి విద్యుత్ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ఏడుకొండలు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ భార్గవి, అసిస్టెంట్ ఇంజనీర్లు కరుణాకరన్, లావణ్యతో పాటు పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో జాప్యం నివారించాలి.. ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి..కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 27,

ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడిందని, అదే స్ఫూర్తితో తదుపరి విడతల్లో జరగనున్న రెండో, మూడో విడత ఎన్నికలను మరింత సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి విడత ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విడత ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలు, కౌంటింగ్ ప్రక్రియలో జరిగిన జాప్యాలు, తదుపరి విడతల్లో చేపట్టాల్సిన మెరుగైన చర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను 15 నిమిషాల్లోపు సీల్ చేసి, భద్రతా నిబంధనల మేరకు లెక్కింపు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో కొన్ని ప్రాంతాల్లో డాక్యుమెంటేషన్, స్టాట్యూటరీ ఫారాల పూర్తి చేయడంలో జాప్యం కారణంగా మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓట్ల లెక్కింపు ఆలస్యమైందని పేర్కొన్నారు. తదుపరి విడతల్లో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, అవసరమైన ఫారాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి తగిన శిక్షణ అందించి కౌంటింగ్ ప్రక్రియను నిర్దిష్ట సమయానికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో తప్పనిసరిగా కనీసం 10 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ సంఖ్యలో టేబుళ్లు ఏర్పాటు చేయడం వల్ల కౌంటింగ్ రౌండ్లు పెరిగి,



ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోందని తెలిపారు. వార్డుల సంఖ్యకు అనుగుణంగా తగినన్ని కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ఒకటి లేదా రెండు రౌండ్లలోనే లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో స్థలం సరిపోని పక్షంలో పక్క గదులను వినియోగించుకోవాలని లేదా ప్రత్యామ్నాయ కేంద్రాలను ముందుగానే ఎంపిక చేసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నందున, కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట తగినంత వెలుతురు ఉండేలా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓలు స్వయంగా పర్యవేక్షించి, నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు.

ఓటింగ్ సమయంలో చెల్లని ఓట్ల నమోదు తగ్గించేందుకు, అధికారులు కొత్తగా సరఫరా చేసిన స్వస్తిక్ స్టాంపులను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. పాత స్టాంపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, ముఖ్యంగా వయసు పైబడిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్న సిబ్బందికి సకాలంలో భోజనం, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో అధికారులు సిద్ధంగా ఉండాలని, అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో జరగనున్న రెండో, మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సమీక్షలో సూచించిన అన్ని మార్పులు, మెరుగుదలలను తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం, ముందస్తు ప్రణాళిక, సమయపాలన అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఘనంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు.

-నాయుడుపేట పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్,టిడిపి నేత,

నానాబాల సుబ్బారావు.

నాయుడుపేట. నవంబర్ 27. పెన్ పవర్ ప్రతినిధి

సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.అనంతరం నాయుడుపేట పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాన్నాబాల సుబ్బారావు

నెలవల సుబ్రహ్మణ్యంకు శాలవాలు కప్పి,సన్మానించి పోలేరమ్మ ఆలయ పూజారిచే అక్షింతలు వేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం నాయుడుపేట పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు మాట్లాడుతూ మా పెద్దాయన నెలవల సుబ్రహ్మణ్యం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడు ఉండాలని,నిండు నూరేళ్లు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని నానాబాల సుబ్బారావు



కొనియాడారు..

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నాయుడుపేట పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్,తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్వకేట్ పసలగంగా ప్రసాద్,దార్ల రాజేంద్ర,నాయుడుపేట పట్టణ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ నిత్యా కృష్ణారెడ్డి,మైలారి రాజశేఖర్,నాయకులు కరీంభాయ్ చెంచయ్య,కాంద్ర రమణయ్య,పసల సురేష్,డక్కిలి సుమన్,ఆబోతుల బాబు, కొన్సిలర్లు ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు,జివిఆర్ నాయుడు,జువ్వలపాటిమస్తాన్,వాకిరి వెంకటేశ్వర్లు,పలువురు నాయకులు నెలవల సుబ్రహ్మణ్యంకు శాలువాలు కప్పి,సన్మానించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు..

కల్లిపేడు వైసీపీ సర్పంచ్ అభ్యర్థి అత్తికాయల స్వప్నకు మద్దతుగా ప్రచారం

విద్యావంతురాలు, పంచాయతీని అదర్శంగా తీర్చిదిద్దుతారని

వైసీపీ నేత ఒట్టూరు కిషోర్ యాదవ్ విజ్ఞప్తి

నాయుడుపేట నవంబర్27 పెన్ పవర్ ప్రతినిధి

కల్లిపేడు గ్రామ పంచాయతీ వైసీపీ సర్పంచ్ అభ్యర్థి అత్తికాయల స్వప్నను ఆశీర్వదించి గెలిపించాలని కోరుతూ వైసీపీ మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్ శుక్రవారం కల్లిపేడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి అత్తికాయల స్వప్నకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా వైసిపి నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్ మాట్లాడుతూ కల్లిపేడు వైసీపీ సర్పంచ్ అభ్యర్థి అత్తికాయల స్వప్న విద్యావంతురాలు, సమర్థురాలు. ఆమె గెలిస్తే గ్రామ పంచాయతీలో మౌలిక వసతులైన రోడ్లు,డ్రైనేజీ, తాగునీరు,వీధి దీపాలు, పారిశుధ్యాన్ని మెరుగుపరిచి పంచాయతీని ఆదర్శవంతంగా



తీర్చిదిద్దుతారని తెలిపారు.ఎల్లప్పుడూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటారు“ అని తెలియజేశారు.

జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడంతోపాటు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. అత్తికాయల స్వప్నను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ గ్రామ,మండల నాయకులు, కార్యకర్తలు,మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

ప్రముఖ విద్యావేత్త డా. ఎన్. మంగాదేవి మృతికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ సంతాపం

గుంటూరు, పెన్ పవర్,నవంబర్, 27,

గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ విద్యావేత్త డా. ఎన్. మంగాదేవి (దేవి మేడమ్) మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గుంటూరులోని బాలకుటీర్‌కు వెళ్లిన డా. రాయపాటి శైలజ, డా. మంగాదేవి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. తాను కూడా ఇదే విద్యాసంస్థలో విద్యాభ్యాసం చేయడంతో దేవి మేడమ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆమె మృతి వ్యక్తిగతంగా ఎంతో బాధ కలిగించిందని తెలిపారు.విద్యారంగ అభివృద్ధికి, ముఖ్యంగా అనాథ పిల్లలకు విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు డా. మంగాదేవి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు



నింపిన ఆమె మరణం విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, డా. మంగాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఏపీ పారిశ్రామిక అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్.. కీలక ప్రాజెక్టులకు ఆమోదం..

అమరావతి: పెన్ పవర్, నవంబర్, 27,

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారంజరిగినఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపనకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రైట్ టు బిజినెస్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సులభతరం చేసే విధానానికి కూడా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీనివల్ల కొత్త పరిశ్రమల ఏర్పాటులో అనుమతుల ప్రక్రియ వేగవంతం కానుంది. అలాగే కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి కోసం రూ.1,500 కోట్ల రుణం తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఇండస్ట్రియల్ కారిడార్‌లో భూకేటాయింపులకు సంబంధించిన విధానానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ కెమికల్ పార్కు ఏర్పాటుకు, శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో కియా సంస్థ రెండో ప్లాంట్ (కియా ప్లాంట్-2) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.అలాగే శ్రీకాకుళం జిల్లాలో అదానీ సంస్థ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్‌కు కూడా ఆమోదం లభించింది.రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడం, పారిశ్రామిక రంగాన్ని విస్తరించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

100వ సైకిల్ సండే సందర్భంగా సైక్లింగ్ అవగాహన ర్యాలీ

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 27:

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సండే సైక్లింగ్ కార్యక్రమం 100వ ఎడిషన్ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో సైక్లింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ఇతివృత్తంతో యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని మై భారత్ రాష్ట్ర సంచాలకులు వెంకట్ ఉజ్వల్ తెలిపారు.ఈ కార్యక్రమం ఉద్దేశాలను వివరించేందుకు శుక్రవారం మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) గుంటూరు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'టువర్డ్స్ పెడలింగ్, టువర్డ్స్ మార్చ్, టువర్డ్స్ ఒలింపిక్స్' లక్ష్యంతో యువతలో



క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మై భారత్ గుంటూరు ఉప సంచాలకులు డి. కిరణ్మయి మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 గంటలకు స్తంభాలగరువులోని శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య మున్సిపల్ పాఠశాలలో 100వ సండే సైక్లింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొననున్నారని, జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులను ఆహ్వానించినట్లు వెల్లడించారు.

ప్రతి ఆదివారం కనీసం అరగంట సైక్లింగ్ చేయడంద్వారాశారీరకదృఢత్వాన్నిపెంపొందించుకోవచ్చని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆమె సూచించారు. నషా ముక్త్ భారత్ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువత, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో మై భారత్ సహాయ సంచాలకులు రాము పాల్గొన్నారు.

చంద్రబాబు కుప్పం ఇంటి నిర్మాణంపై వైసీపీ విష ప్రచారం చేస్తోంది టీడీపీ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

గుంటూరు,పెన్ పవర్,నవంబర్, 27,

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో నిర్మించుకుంటున్న ఇంటిపై వైసీపీ నాయకులు కావాలనే విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య విమర్శించారు.50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఆస్తుల విషయంలో ఎంతో నిరాడంబరంగా ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సుమారు 1100 గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంట్లో దాదాపు 30 ఏళ్ల పాటు నివసించారని, ఆ ఇల్లు భువనేశ్వరికి ఎన్టీఆర్ ద్వారా వారసత్వంగా వచ్చిందని తెలిపారు. లోకేష్ వివాహం అనంతరం 2017లో అదనంగా స్థలం కొనుగోలు చేసి, బ్యాంకు రుణంతో ఇల్లు నిర్మించుకున్నారని, ఇప్పటికీ ఆ రుణాన్ని చెల్లిస్తున్నారని వివరించారు. అదేవిధంగా నారావారిపల్లెలో ఉన్న ఇల్లు కూడా చంద్రబాబు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి అని తెలిపారు. ప్రస్తుతం కుప్పంలో 1,455 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ వన్ విధానంలో, అమరావతిలో 1,450 చదరపు గజాల స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రి తన నివాస అవసరాల కోసం ఇల్లు నిర్మించుకుంటే దానిని ప్యాలెస్‌గా చిత్రీకరిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన ఇళ్ల విస్తీర్ణంతో పోలిస్తే జగన్‌కు సంబంధించినవిగా ప్రచారంలో ఉన్న ప్యాలెస్‌లు, ఆస్తుల విస్తీర్ణం ఎంతో ఎక్కువగా ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్, తాడేపల్లి, బెంగళూరులోని యలహంక, విశాఖపట్నంలోని రుషికొండ, పులివెందుల, ఇడుపులపాయ వంటి ప్రాంతాల్లో జగన్‌కు సంబంధించిన నివాసాలు, ఆస్తులపై లక్ష్మయ్య పలు వివరాలను ప్రస్తావించారు. ఆయా నిర్మాణాల విస్తీర్ణం, ఆస్తుల వివరాలను పోల్చి చూస్తే వాస్తవ పరిస్థితి ప్రజలకు అర్థమవుతుందని అన్నారు.అలాగే జగన్‌కు సంబంధించినవిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న



వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, వ్యవసాయ భూములు తదితర ఆస్తుల అంశాలు కూడా గతంలో సీబీఐ, ఈడీ కేసుల్లో ప్రస్తావనకు వచ్చాయని తెలిపారు.

50 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసిన చంద్రబాబు నాయుడు తన నివాసం నిర్మించుకుంటుంటే దానిపై విమర్శలు చేయడం తగదని లక్ష్మయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తుల విషయంలో ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తమ నాయకులకు సంబంధించిన ఆస్తుల వివరాలను కూడా ప్రజలకు వివరించాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.కుప్పం ఇంటి నిర్మాణాన్ని వివాదాస్పదం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న ప్రతిపక్షాల ప్రచారాన్ని ప్రజలు నమ్మరని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య స్పష్టం చేశారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు పెన్ పవర్,నవంబర్, 27,

నగరంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక నియంత్రణ కార్యక్రమం చేపట్టినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ శేషయ్య పర్యవేక్షణలో శుక్రవారం మలేరియా సిబ్బంది వార్డుల వారీగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వర్షాల కారణంగా ఏర్పడిన నీటి నిల్వలు, డ్రైనేజీలు, కాలువలు, కల్వర్టులు, ఖాళీ స్థలాలు, ఇతర దోమల ఆవాసాలను గుర్తించి నిర్మూలించే చర్యలు చేపట్టారు. ఈసందర్భంగాకమిషనర్‌మాట్లాడుతూ.. దోమల నివారణలో భాగంగా యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహిస్తూ దోమల లార్వా దశలోనే నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి నిల్వ ప్రాంతాలు, మురుగు కాలువలు,నిర్మాణప్రదేశాలు,ఇళ్లపరిసరాలనుపరిశీలించిలార్వానిర్మూలనచర్యలుచేపడుతున్నట్లువివరించారు.నగరంలోని చెరువులు, పెద్ద ఖాళీ స్థలాలు, కాలువల్లో డ్రోన్‌ల సహాయంతో యాంటీ లార్వల్‌ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డ్రోన్‌ల వినియోగంతో విస్తృత ప్రాంతాలను తక్కువ సమయంలో కవర్ చేయడంతో పాటు సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో కూడా దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు.అదేవిధంగా దోమల సాంద్రత అధికంగా ఉన్న రోడ్లు, నివాస ప్రాంతాలు, మార్కెట్లు, కాలనీలతో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వర్టులు, డ్రైనేజీ మార్గాలు, చీకటి, తేమతో కూడిన ప్రాంతాల్లో దోమల ఆవాసాలు ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా కల్వర్ట్ ఫాగింగ్ చేపడుతున్నామని వెల్లడించారు.ప్రజలు కూడా దోమల నివారణలో భాగస్వాములు కావాలని కమిషనర్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కంటైనర్లు, పూల కుండీల్లోని నీటిని వారానికి ఒకసారి తొలగించి శుభ్రం చేయాలనికోరారు.దోమతెరలనువినియోగించాలని , జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన



అమరావతి,పెన్ పవర్,నవంబర్ 27:

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు.రాజమహేంద్రవరంలో జరిగే జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌కు చేరుకుంటారు. 10.15 గంటలకు మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్తారు.మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు నిర్వహించే జిల్లా కోర్టు 222 సంవత్సరాలు, బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.రాజమహేంద్రవరంలో కార్యక్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 01.45 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి -- ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, పెన్ పవర్,నవంబర్, 27,

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో ఎమ్మెల్యే కొండయ్యతో, పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు తల్లికి వందనం, దీపం వంటి పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ తల్లుల ఆత్మగౌరవానికి





ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ పాలనలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని నిర్మాణ పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని, ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.మైనారిటీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నసీర్ అన్నారు. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాలు, విద్యార్థులకు విదేశీ విద్యా పథకం, షాదీఖానాల నిర్మాణం, ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాల చెల్లింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి చేశారు.

కారంపూడిలో చరిత్రాత్మక ఏకగ్రీవం: సర్పంచ్‌గా కటికల బాలకృష్ణ ఎన్నిక సర్పంచ్‌తో పాటు 16 మంది వార్డు సభ్యులూ ఏకగ్రీవం



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల నవంబర్ : 27

పల్నాడు జిల్లా కారంపూడి మండల కేంద్రమైన కారంపూడి మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సరికొత్త చరిత్ర నమోదైంది. గ్రామ సర్పంచ్‌గా కటికల బాలకృష్ణతో పాటు మొత్తం 16 మంది వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి పోటీ లేకుండా పంచాయతీ పూర్తిస్థాయిలో ఏకగ్రీవం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. బరిలో ఇతర అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో, సర్పంచ్ మరియు 16 వార్డుల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (స్టేజ్-1) ఎస్. బాబు నాయక్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా కటికల బాలకృష్ణ మరియు వార్డు సభ్యులు తమ నియామక (డిక్లరేషన్) పత్రాలను అందుకున్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యుల జాబితా:

1వ వార్డు: బొంకురి శారద

2వ వార్డు: దంత ఆంజనేయులు

3వ వార్డు: కల్వ పేరయ్య



4వ వార్డు: రమావత్ తిరుపతి బాయి

5వ వార్డు: సిరిగిరి మణికంఠ

6వ వార్డు: తోట లక్ష్మి, 7వ వార్డు: పలిశెట్టి లక్ష్మి, 8వ వార్డు: పుడమి వెంకటరావు,9వ వార్డు: నందిగం సువార్త,10వ వార్డు: షేక్ జాస్మిన్

11వ వార్డు: సూరే ప్రసన్న రామకృష్ణ,12వ వార్డు: వాలే వీర నాగేశ్వరరావు

13వ వార్డు: ముద్దంగుల బాల వెంకటేశ్వర్లు

14వ వార్డు: చల్లా అరుణ

15వ వార్డు: బెల్లంకొండ శ్రీను

16వ వార్డు: తెంపల్లి యశోదమ్మ

కూటమి నాయకుల అభినందనలు:

గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవం కావడం పట్ల స్థానిక కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ కటికల బాలకృష్ణను, 16 మంది వార్డు సభ్యులను కూటమి నాయకులు, గ్రామ పెద్దలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు....

ఆంగోత్ జంకు కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం

--అందజేసిన బీఆర్ఎస్ నేత వడ్త్య రమేష్

పెన్ పవర్,నవంబర్, 27,

చింతపల్లి మండల పరిధిలోని దేన్య నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల గాసిరాం తండాకు చెందిన ఆంగోత్ జంకు కుటుంబానికి దేవరకొండ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్ రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆంగోత్ జంకు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు.

విషయం తెలుసుకున్న వడ్త్య రమేష్ మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా ప్రకటించిన రూ. 5,000 నగదును స్థానిక ఉప సర్పంచ్ రామావత్ భాస్కర్ నాయక్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్ నాయక్, స్థానిక నాయకులు కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీకి 38, తెలంగాణకు 26 ఎంపీ సీట్లు.. లోక్‌సభలో 50 శాతం పెంపునకు కేంద్రం ఆమోదం!



లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ సవరణ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2051 వరకు రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని కొనసాగించాలని నిర్ణయించింది. ఈ అంశాలపై చర్చించేందుకు నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి.

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ ప్రతిపాదనలో మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న ఎంపీ సీట్ల నిష్పత్తిని 2051 వరకు కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలకు పరిష్కారంగా ఈ ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

ఈ లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు సుమారు 38కి పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 స్థానాలు దాదాపు 26కి చేరవచ్చు. అయితే ఇవి ప్రతిపాదన ఆధారంగా వేసిన అంచనాలు మాత్రమే. తుది సీట్ల కేటాయింపు ఇంకా ఖరారు కావాల్సి ఉంది.మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ రెండు అంశాలపై చర్చించేందుకు నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి.

గతంలో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో అవసరమైన మెజారిటీ పొందలేకపోయింది. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో కేంద్రం మరోసారి ముందుకు వస్తోంది. ఈ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం లభిస్తే దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

దక్షిణాది సీట్లకు ఢోకా వద్దు! 50 శాతం పెంపే సరైన పరిష్కారం

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియలో జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను అన్ని రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50 శాతం పెంచడమే దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు, దేశ సమగ్రతకు సరైన పరిష్కారమని ఆయన పేర్కొన్నారు.జనాభా నియంత్రణ చర్యల వల్ల దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్న ఆందోళన చాలా కాలంగా ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేశామని, దానివల్ల ప్రస్తుతం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) తగ్గిపోయిందని తెలిపారు. 1971 జనాభా ప్రాతిపదికన గతంలో సీట్ల సంఖ్యను స్తంభింపజేశారని, ఇప్పుడు కొత్తగా జనాభా ఆధారంగా మాత్రమే డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాల గళం తగ్గే ప్రమాదం ఉందని చెప్పారు. దీనికి పరిష్కారంగా ప్రతి రాష్ట్రంలో ప్రస్తుత సీట్ల సంఖ్య 50 శాతం పెంచితే, దక్షిణాది ప్రాతినిధ్యం అదే నిష్పత్తిలో కొనసాగుతుందని ఆయన వివరించారు. ఈ విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సీట్ల సంఖ్య 25 నుంచి 38కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి, తెలంగాణలో 17 నుంచి 26కి, కేరళలో 20 నుంచి 30కి పెరిగే అవకాశం ఉంటుందని, తద్వారా మొత్తం దక్షిణాది సీట్ల సంఖ్య 129 నుంచి 195కి చేరి ప్రస్తుత 23.76 శాతం నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

అలాగే మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు పడటం స్వాగతించదగ్గ పరిణామమని చంద్రబాబు అన్నారు. 1996లో హెచ్.డి. దేవెగౌడ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా తాను ఈ బిల్లు ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రత్యక్షంగా చూశానని, ఆ తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ పలు ప్రయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. విద్య, ఐటీ, శాస్త్ర సాంకేతిక తదితర రంగాల్లో మహిళలు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని, చట్టసభల్లోనూ వారికి తగిన ప్రాధాన్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.

మొత్తం ం

సీట్ల సంఖ్య 50 శాతం పెంచి, అందులో మహిళలకు 33 శాతం కేటాయించడం ద్వారా అటు పురుష ప్రజాప్రతినిధులకు ఇబ్బంది కలగకుండా, ఇటు మహిళలకు న్యాయం జరిగే సమతూకం సాధ్యమవుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇది దేశ ప్రయోజనాలకు సంబంధించిన చారిత్రక పరిణామమని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చి మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి బిల్లులను అడ్డుకోవడం సరికాదని, ప్రతి ఒక్కరూ విజ్ఞతతో వ్యవహరించి దేశ పురోగతికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ సమరం : టీడీపీ ఎందుకు గెలిచింది? వైసీపీ ఎందుకు ఓడింది?



తాజా పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ ఓటు వాటా 39 శాతం నుంచి 24.6 శాతానికి తగ్గినట్లు కథనం పేర్కొంది. నాయకత్వం, కేడర్ మధ్య పెరిగిన అంతరం, స్థానిక నేతల నిర్లక్ష్యం, కూటమి పార్టీల సమన్వయం ఈ మార్పునకు కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ గ్రామస్థాయిలో మళ్లీ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

ముందుగ మురిస్తే పండుగ కాదంటారు.. గెలిచినప్పుడే ఓడినప్పుడు గట్టిగానే నిలబడాలి. అప్పుడే ప్రజల్లో సానుభూతి వస్తుంది. ఓడిన పార్టీని గెలిపించాలన్న కసి పెరుగుతుంది. కానీ వైసీపీ పోరాటం చేయకుండానే కాడి వదిలేస్తున్న తీరు ఆపార్టీని బలహీనంగా మార్చేస్తోంది. తాజా పంచాయితీ ఎన్నికల్లో ఒకప్పుడు 39 శాతంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు వాటా తాజాగా 24.6 శాతానికి పరిమితం కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.వైసీపీ ఓటు బ్యాంకులో దాదాపు 14.4 శాతం తగ్గుదల కనిపించడం కేవలం గెలుపోటముల లెక్క మాత్రమే కాదు.. అంతకుమించిన క్షేత్రస్థాయిలో పతనాన్ని సూచిస్తోంది.. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామీణ ప్రాంతాలు.. సంక్షేమ పథకాల లబ్ధిదారులే వైసీపీకి ప్రధాన బలంగా నిలిచాయి. అయితే తాజా ఫలితాలు ఆ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక వస్తోందనే సంకేతాలను ఇస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం నాయకత్వం, కేడర్ మధ్య పెరిగిన అంతరమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు, ప్రాధాన్యతతో చురుగ్గా పనిచేసిన కొందరు స్థానిక నేతలు.. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలకు, కార్యకర్తలకు అదే స్థాయిలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కష్టకాలంలో అధిష్టానం నుంచి తగిన భరోసా లభించకపోవడం వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గిందని.. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో స్థానిక నాయకుల వ్యవహారశైలి, అభ్యర్థుల ఎంపికలో లోపాలు, కొన్ని నిర్ణయాలపై ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి ఓటు శాతం తగ్గడానికి దారితీశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ రాజకీయాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మద్దతుదారులు ఆధిక్యం సాధించడం వెనుక బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఒకే వైపు కేంద్రీకృతమైంది. గ్రామస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఏర్పడిన సమన్వయం కూటమి మద్దతుదారులకు అదనపు బలాన్ని ఇచ్చిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.అంతేకాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే టీడీపీ తన గ్రామస్థాయి కమిటీలను సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడం.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను నిరంతరం సమాయత్తం చేయడం ఇప్పుడు ఫలితాలను ఇస్తోందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల అభివృద్ధి, నిధుల కేటాయింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లు అధికారంలో ఉన్న కూటమి మద్దతుదారుల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని కూడా నిపుణులు విశ్లేషిస్తున్నారు.పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీ గుర్తులపై జరగవు. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ, కుటుంబ సంబంధాలు, కుల సమీకరణాలు, స్థానిక సమస్యలే ఫలితాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఈ విజయాలను నేరుగా అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో పోల్చలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎంత కవర్ చేసుకున్నా.. మునుపటి ఓటు బ్యాంక్ తగ్గడం అనేది వైసీపీకి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది.. వచ్చే ఎన్నికల నాటికి బలపడకపోతే పార్టీ మనుగడకే ముప్పుగా మారడం ఖాయం. ఈ విషయంలో జగన్ క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. వైసీపీ అధినేత జగన్ కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా గ్రామీణ స్థాయిలో కార్యకర్తలకు భరోసా కల్పించి, స్థానిక నాయకత్వాన్ని తిరిగి క్రియాశీలం చేయడం ద్వారా మాత్రమే పార్టీ తన పాత బలాన్ని తిరిగి పొందగలదని విశ్లేషకులు సూచిస్తున్నారు.

గ్రామాల్లో వైసీపీకి గడ్డుకాలం.. జగన్‌కు అసలు పరీక్ష ఇప్పుడే మొదలైందా?



గ్రామాల్లో వైసీపీకి గడ్డుకాలం.. జగన్‌కు అసలు పరీక్ష ఇప్పుడే మొదలైందా?

ఏపీ తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ ఓటు బ్యాంకు 39 శాతం నుంచి 24.6 శాతానికి పడిపోయినట్లు కథనం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పట్టు తగ్గడంపై చర్చ జరుగుతోంది. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వడం, స్థానిక నాయకులను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై పోరాడటం జగన్‌కు కీలక సవాలుగా మారాయి. జరిగినవి పంచాయితీ ఎన్నికలు.. అక్కడ పార్టీలుండవు.. కానీ పనిచేసిన నేత ఉంటాడు. అతడి వెనుక పార్టీ ఉంటుంది. ఎవరైతే ప్రజలకు మంచి చేస్తారో పార్టీలకు అతీతంగా వారినే పల్లెల్లో గెలిపిస్తారు. దానికి టీడీపీ, జనసేన, వైసీపీ అన్న తేడాలు చూడరు.. కానీ అధికారంలో లేకున్నా ఇక్కడ కూడా వైసీపీ ఓడిపోవడం అంటే.. ఆ నేతలు జనాలకు దూరంగా ఉన్నట్టే లెక్క.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అధికారం కోల్పోవడం ఒక కోణమైతే.. పల్లెలపై పట్టు సడలడం ఆ పార్టీకి చావుదెబ్బతో సమానం... ఒకప్పుడు వైఎస్సార్‌సీపీకి కంచుకోటలా నిలిచిన గ్రామీణ ఓటు బ్యాంకు ఇప్పుడు క్షీణిస్తోందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తాజాగా వెలువడిన తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి పలు కీలక ప్రశ్నలను సంధిస్తున్నాయి.

గత ఎన్నికల్లో దాదాపు 39 శాతం ఓటు బ్యాంకును కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ.. తాజా పంచాయతీ తొలి విడత ఫలితాల్లో 24.6 శాతానికి పడిపోవడం అందరినీ షాక్ కు గురిచేసింది.. సుమారు 14.4 శాతం తగ్గుదల సాధారణ విషయం కాదు. పంచాయతీ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలతో సమానం కాకపోయినా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానాడిని పసిగట్టడానికి ఇవి కీలక కొలమానాలు. స్థానిక అభ్యర్థుల బలం, సామాజిక సమీకరణాలు ప్రభావం చూపినప్పటికీ ఇంత భారీ వ్యత్యాసం పార్టీకి హెచ్చరిక సంకేతమే.గ్రామాల్లో జెండా మోసే కార్యకర్తలు పార్టీకి ప్రాణం. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్ వ్యవస్థపై అధికంగా ఆధారపడటం వల్ల సంప్రదాయ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే అసంతృప్తి వినిపించింది. ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో క్షేత్రస్థాయి శ్రేణులకు భరోసా కల్పించి వారిని తిరిగి క్రియాశీలంగా మార్చడం పార్టీకి అత్యవసరం.ప్రతి నిర్ణయం అధిష్ఠానం నుంచే రావడం.. స్థానిక నాయకుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడం వల్లే వైసీపీ క్షేత్రస్థాయిలో బలహీన పడి ఓడిపోయిందన్న విశ్లేషణలు సాగుతున్నాయి.. మరోవైపు గ్రామీణ ఓటరు కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు..

ప్రతిపక్షంలో ఉండటం అంటే ప్రభుత్వ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడటం కూడా అంతే కీలకం. పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ద్వారానే పునరుజ్జీవం సాధ్యమవుతుంది.అధికారం కోల్పోవడం తాత్కాలికం కావచ్చు.. కానీ గ్రామీణ ఓటు బ్యాంకును.. క్యాడర్‌ను నిలబెట్టుకోవడమే వైఎస్ జగన్ ముందున్న అసలైన రాజకీయ పరీక్షగా చెప్పొచ్చు.

ఏపీలో ఖాతా తెరిచిన ఆమ్ ఆద్మీ పార్టీ..

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) బోణీ కొట్టింది. దుప్పలపూడి పంచాయతీ పరిధిలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు రెండు వార్డు స్థానాలను కైవసం చేసుకుని విజయం సాధించారు. జాతీయ స్థాయిలో విస్తరించే ప్రయత్నాల్లో ఉన్న ఆప్‌కు ఈ ఫలితాలు ఏపీలో సరికొత్త ఉత్సాహాన్ని అందించాయి.దుప్పలపూడి పంచాయతీ ఎన్నికల్లో ఆప్ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు స్థానికంగా ప్రభావం చూపారు. 3వ వార్డు నుంచి పోటీ చేసిన కొల్లాపు లక్ష్మణ్ ప్రత్యర్థులపై విజయం సాధించగా, 6వ వార్డులో పోటీ చేసిన తంగుడు దుర్గ గెలుపొందారు. తమ అభ్యర్థులు విజయం సాధించడంతో స్థానిక ఆప్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.ఈ విజయంపై ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇది తమ పార్టీకి చారిత్రక విజయమని పార్టీ పేర్కొంది. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు కొల్లాపు లక్ష్మణ్, తంగుడు దుర్గలకు నాయకత్వం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసింది. తమ అభ్యర్థులను ఆదరించి గెలిపించినందుకు ఆంధ్రప్రదేశ్ ఓటర్లకు ఆప్ ధన్యవాదాలు తెలిపింది. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటారని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

గుంటూరు మార్కెట్‌లో మునగకాయ ధరలు పైపైకి.. కిలో రూ.150!

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో మునగకాయ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. స్థానిక మార్కెట్లలో ఒక్క మునగకాయ ధర ఏకంగా రూ. 30 వరకు పలుకుతోంది. గతంలో రూ. 5 నుంచి రూ. 10 మధ్య లభించిన మునక్కాయలు, గత రెండు నెలలుగా రూ. 25 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తుండటంతో కొనుగోలుదారులు తీవ్ర ఆశ్చర్యానికి గురవుతున్నారు. సాధారణంగా నలుగురు సభ్యులున్న ఒక కుటుంబానికి కూర వండాలంటే కనీసం నాలుగు నుంచి ఐదు మునక్కాయలు అవసరమవుతాయి. ప్రస్తుత ధరల ప్రకారం రోజువారీ కూర కోసమే రూ. 120 నుంచి రూ. 150 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు మునగకాయ కొనాలంటేనే జంకుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లోనూ వీటి ధర కిలో రూ. 150 పైనే పలుకుతోంది. కాయల సైజును బట్టి కిలోకు దాదాపు 10 నుంచి 20 మునక్కాయలు తూగుతున్నాయి.మునగకాయ ధరలు ఇంత తీవ్రంగా పెరగడానికి ప్రధాన కారణం స్థానిక దిగుబడి పూర్తిగా పడిపోవడమేనని వ్యాపారులు చెబుతున్నారు. ఎల్ నినో పరిస్థితుల కారణంగా సరైన వర్షాలు లేకపోవడం, గతంలో వచ్చిన మూడు వరుస తుపాన్ల ప్రభావంతో పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో స్థానికంగా పంట దిగుబడి నిలిచిపోయింది. ప్రస్తుతం మార్కెట్ అవసరాల కోసం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి మునగకాయలను దిగుమతి చేసుకుంటున్నారు.మరోవైపు ప్రస్తుత సీజన్ కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. కార్తిక మాసం కావడంతో చాలామంది అయ్యప్ప దీక్షలు చేపట్టడం, శాకాహారానికే ప్రాధాన్యం ఇవ్వడం, అలాగే పెళ్లిళ్ల సీజన్ నడుస్తుండటంతో మార్కెట్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. సాంబార్, టమాటా కూరల్లో విరివిగా వాడే మునగకాయలకు ఔషధ గుణాలు కూడా ఉండటంతో వినియోగదారులు అధిక ధరలైనా కొనుగోలు చేయాల్సి వస్తోంది. స్థానిక పంట చేతికి రావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటివరకు మార్కెట్‌లో మునగకాయ ధరలు ఇదే స్థాయిలో కొనసాగవచ్చని వ్యాపారులు, మార్కెట్ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

కేసీఆర్ వార్నింగ్ ఇవ్వడంతోనే జగన్ పనులు ఆపేశారు

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించి మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన పోస్టుకు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కౌంటర్ ఇచ్చారు. రాయలసీమ అభివృద్ధిని, ఇక్కడి ప్రాజెక్టులను అడ్డుకుంది ముమ్మాటికీ జగనేనంటూ ఆయన మండిపడ్డారు. అనంతపురంలో కాల్వ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.జగన్ హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయని కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. తన రాజకీయ పెద్దన్నగా భావించిన కేసీఆర్ వార్నింగ్ ఇవ్వడంతోనే జగన్ ఈ ప్రాజెక్టు పనులను నిలిపివేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము స్వయంగా చెప్పడం లేదని, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్వయంగా వెల్లడించారని తెలిపారు. అంతేకాకుండా, ఈ పథకంపై కోర్టు స్టే వచ్చిన తర్వాత జగన్ దాదాపు మూడేళ్లన్నర పాటు అధికారంలో ఉన్నప్పటికీ, ఎందుకు కనీసం అప్పీల్ కూడా చేయలేదని కాల్వ నిలదీశారు.అంతకుముందు, రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ఇది కొత్త ప్రాజెక్టు కాదని, శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగుల కంటే తగ్గినప్పుడు సీమకు కేటాయించిన నీటిని సమర్థంగా వాడుకునే ఒక ఇన్సూరెన్స్ లాంటి పథకమని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కారణాలతో ప్రాజెక్టును నిలిపివేసిందని జగన్ ఆరోపించగా, అసలు ప్రాజెక్టును ఆపేసి రాయలసీమకు ద్రోహం చేసింది జగనేనని కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

పెన్ పవర్

శనివారం 28 నవంబర్ 2026

హిట్ మ్యాన్ రిటర్న్స్.. ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా మళ్లీ రోహిత్ శర్మ

- ముంబై ఇండియన్స్ సారథిగా రోహిత్ శర్మ పునరాగమనం
- ఐపీఎల్ 2027 సీజన్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు
- పంజాబ్ కింగ్స్ జట్టుకు ట్రేడ్ అయిన హార్దిక్ పాండ్యా
- గతంలో రోహిత్ సారథ్యంలోనే ఐదు ట్రోఫీలు గెలిచిన ముంబై
- ప్రధాన కోచ్ పొలార్డ్‌తో కలిసి వ్యూహరచన చేయనున్న రోహిత్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. జట్టుకు గతంలో ఐదు ట్రోఫీలు అందించిన స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మను తిరిగి కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం (నవంబర్ 27) సాయంత్రం 5:45 గంటలకు ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.గతంలో 2024 సీజన్‌కు ముందు రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాకు ముంబై యాజమాన్యం సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే ఇటీవల జరిగిన పరిణామాల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు వెళ్లగా, పంజాబ్ నుంచి ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు ట్రేడ్ అయ్యాడు. హార్దిక్ నిష్క్రమణ అనంతరం సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాల పేర్లు కెప్టెన్సీ కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, ఫ్రాంచైజీ చివరకు అత్యంత అనుభవజ్ఞుడైన రోహిత్ శర్మ వైపే మొగ్గు చూపింది.రోహిత్ శర్మ గతంలో 2013 సీజన్ మధ్య నుంచి 2023 వరకు ముంబై ఇండియన్స్‌కు పూర్తిస్థాయి సారథిగా వ్యవహరించాడు. హిట్ మ్యాన్ నాయకత్వంలోనే ముంబై జట్టు 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన కెప్టెన్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా రోహిత్ కెప్టెన్సీలో ముంబై జట్టు ఫైనల్‌కు చేరిన ప్రతిసారీ ట్రోఫీని ముద్దాడింది.హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబై జట్టు మూడేళ్లపాటు ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. 2024 సీజన్‌లో పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచిన ముంబై, 2025లో క్వాలిఫైయర్ 2 వరకు వెళ్లింది. ఇక 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకోవడంతో జట్టు టైటిల్ కరవు ఆరేళ్లకు చేరింది. తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడంపై రోహిత్ శర్మ స్పందిస్తూ, "ముంబై ఇండియన్స్ నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం. ఈ జట్టును నడిపించడాన్ని ఎప్పుడూ ఎంతో గర్వంగా భావిస్తాను. నా 20వ సీజన్ కోసం పూర్తి ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నాను" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసులో ఉన్న రోహిత్ శర్మను, రాబోయే మెగా వేలానికి ముందస్తు వ్యూహంలో భాగంగా ఈ సైకిల్ చివరి సీజన్‌కు సారథిగా నియమించినట్లు తెలుస్తోంది. జట్టులో ప్రధాన ఓపెనర్‌గా కొనసాగుతూనే, ప్రధాన కోచ్ కీరన్ పొలార్డ్‌తో కలిసి 2027 వేలానికి సంబంధించిన ప్రణాళికలను రోహిత్ సిద్ధం చేయనున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ లాంటి పటిష్ఠమైన పేస్ దళం తోడవడంతో, రోహిత్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ తిరిగి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.

గత శతాబ్దం సచిన్‌దైతే.. ఈ శతాబ్దం వైభవ్ సూర్యవంశీదే: ఎమ్మెస్కే ప్రసాద్

- వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించిన మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్
- 53 బంతుల్లోనే 204 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన వైభవ్
- వైభవ్‌కు రాహుల్ ద్రవిడ్ వీవీఎస్ లక్ష్మణ్‌లతో మార్గదర్శకత్వం కల్పించాలని బీసీసీఐకి విజ్ఞప్తి
- ఢిల్లీ యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య ఆటతీరును ప్రశంసించిన ఎమ్మెస్కే



భారత యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ తరానికొక్కసారి మాత్రమే వచ్చే అరుదైన ఆటగాడని కొనియాడాడు. గత శతాబ్దం సచిన్ టెండూల్కర్ పేరిట ఎలాగైతే నిలిచిపోయిందో, ప్రస్తుత శతాబ్దం వైభవ్ సూర్యవంశీ సొంతం కానుందని ఎమ్మెస్కే అభిప్రాయపడ్డాడు. ఇలాంటి అద్భుతమైన ప్రతిభావంతుడిని సరైన మార్గదర్శకత్వంలో రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నాడు. దోహా వేదికగా యూఏఈతో జరిగిన మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో ఇండియా-ఏ తరఫున ఆడిన వైభవ్, కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే ఇది అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీగా రికార్డుకెక్కింది. ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ ఏకంగా 28 సిక్సర్లు బాదాడు. ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా కూడా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా, లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ, ఫాస్టెస్ట్ 150 పరుగుల రికార్డులను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే 11 బంతుల్లోనే అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించిన రికార్డు, అలాగే లిస్ట్-ఏ, టీ20 ఫార్మాట్లలో అత్యంత పిన్న వయసులోనే సెంచరీ సాధించిన ఆటగాడిగా, అతి పిన్న వయస్కుడైన టీ20 కెప్టెన్‌గా వైభవ్ రికార్డుల్లో నిలిచాడు. 2025లో 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన వైభవ్, తన తొలి రెండు సీజన్లలోనే రెండు సెంచరీలు, ఆరు హాఫ్ సెంచరీలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఏడాది జరిగిన అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. జూలైలో ఇంగ్లండ్‌పై టీ20 అరంగేట్రం చేసిన అనంతరం భారత్ తరఫున ఇప్పటికే 10 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ.. సచిన్ టెండూల్కర్ 16, 17 ఏళ్ల వయసులో జట్టులోకి వచ్చినప్పుడు ముంబై సీనియర్ క్రికెటర్లు దిలీప్ వెంగ్‌సర్కార్, రవిశాస్త్రి, సునీల్ గవాస్కర్ అతడికి అండగా నిలబడి కాపాడారని గుర్తుచేశాడు. వైభవ్ సూర్యవంశీ విషయంలోనూ అలాంటి సహాయం అందించాలని బీసీసీఐకి సూచించాడు. "వైభవ్ అరుదైన ప్రతిభావంతుడు. అయితే ఇలాంటి యువకుడికి తగిన మార్గదర్శకులు ఎంతో అవసరం. ప్రతిభ ఉండటం సహజమే కానీ, దానిని క్రమశిక్షణతో పెంచి, నిలకడైన ప్రదర్శనగా మార్చడానికి సరైన వ్యక్తుల పర్యవేక్షణ కావాలి. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ లాంటి దిగ్గజాల సంరక్షణలో వైభవ్ ఉండేలా బీసీసీఐ చర్యలు తీసుకోవాలి" అని ఎమ్మెస్కే ప్రసాద్ విజ్ఞప్తి చేశాడు.

తన కెరీర్‌లో కొత్త ప్రతిభను గుర్తించే పాత్రను ఎప్పుడూ ఇష్టపడతానని ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపాడు. గతంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో కేఎస్ భరత్, నితీశ్ కుమార్ రెడ్డి వంటి ఆటగాళ్లను 13, 14 ఏళ్ల వయసులోనే గుర్తించి ప్రోత్సహించామని, వారు ఈరోజు దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని చెప్పాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఢిల్లీ కెప్టెన్‌గా 181 పరుగులు చేసిన లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యను కూడా ఎమ్మెస్కే ప్రశంసించాడు. ప్రియాంశ్ ఆర్య అద్భుతమైన ఆటగాడని, లక్నో సూపర్ జెయింట్స్ తరఫున అతడిని ఎంపిక చేయాలని తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ కుదరలేదని, ఇలాంటి యువ ఆటగాళ్లు జాతీయ స్థాయిలో తమ ముద్ర వేస్తుండటం ఎంతో సంతోషాన్నిస్తోందని వివరించాడు.

ఫీల్డింగ్‌లో ఆలస్యం.. సహచర ఆటగాడిపై నోరు పారేసుకున్న హర్షిత్ రాణా?

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2026లో భారత 'ఏ' జట్టు ప్రయాణం ముగిసింది. దోహా వేదికగా గురువారం జరిగిన సెమీ ఫైనల్‌లో శ్రీలంక 'ఏ' చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఓటమి ఒకవైపు ఉండగా, భారత యువ పేసర్ హర్షిత్ రాణా తన ప్రవర్తనతో తీవ్ర విమర్శల పాలయ్యాడు.శ్రీలంక 'ఏ'తో జరిగిన మ్యాచ్‌లో హర్షిత్ రాణా బౌలింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. డీప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బంతిని అందుకోవడంలో కొద్దిగా ఆలస్యం చేశాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన హర్షిత్, సహచర ఆటగాడిపై నోరు పారేసుకున్నట్లు కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, అతని తీరుపై అభిమానులు మండిపడుతున్నారు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ నేతృత్వంలోని భారత 'ఏ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 317 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, శ్రీలంక 'ఏ' బ్యాటర్లు లసిత్ క్రూస్‌పుల్లే (116), సినెత్ జయవర్ధన (105) సెంచరీలతో చెలరేగి, కేవలం 41.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. దీంతో శ్రీలంక జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది.ఈ టోర్నమెంట్‌లో హర్షిత్ రాణా మొత్తం నాలుగు మ్యాచ్‌లలో 8 వికెట్లు పడగొట్టినప్పటికీ, 8.35 ఎకానమీ రేటుతో 217 పరుగులు ఇచ్చాడు. నేపాల్‌పై 16 పరుగులిచ్చి 4 వికెట్లు తీయడం అతని అత్యుత్తమ ప్రదర్శన. కానీ, యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 10 ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకున్నాడు. సెమీస్‌లో ఓటమితో భారత్ 'ఏ' జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఆ నలుగురి కోసం అవే పాత చింతకాయ కథలు!

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ ఇప్పటికీ రొటీన్ మాస్, యాక్షన్ కథలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రవితేజ 'ఇరుముడి'లో ఇమేజ్‌కు భిన్నంగా హుందా పాత్రతో మెప్పించడంతో సీనియర్ హీరోలు కూడా వైవిధ్యమైన కథలు ఎంచుకోవాలనే చర్చ మొదలైంది. గత ప్రయోగాల పరాజయాలే వారి వెనుకడుగుకు కారణమని ట్రేడ్ వర్గాల అభిప్రాయం.



తెలుగు సినీ పరిశ్రమకు దశాబ్దాలుగా నాలుగు మూలస్తంభాలుగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున, విక్టరీ వెంకటేష్ ఇప్పటికీ బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటుతున్నారు. అయితే ఈ అగ్ర హీరోల కోసం టాలీవుడ్ దర్శక రచయితలు ఇప్పటికీ అవే పాత రొటీన్ మాస్, యాక్షన్ కథలనే రాస్తుండటంపై సినీ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలీవుడ్‌లో అమితాబ్ బచ్చన్, మాలీవుడ్‌లో మోహన్ లాల్, మమ్ముట్టి వంటి దిగ్గజాలు తమ వయసుకు తగ్గ వైవిధ్యమైన, ప్రయోగాత్మక పాత్రల్లో జీవిస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంటే.. మన తెలుగు సీనియర్ స్టార్స్ మాత్రం ఇంకా అవే కమర్షియల్ చట్రంలోనే ఇరుక్కుపోయారనే చర్చ బలంగా నడుస్తోంది. ఇటీవల విడుదలైన -ఇరుముడి- చిత్రంలో మాస్ మహారాజా రవితేజ తన ఇమేజ్‌ను పక్కనపెట్టి ఎంతో సెటిల్డ్ పెర్ఫామెన్స్‌తో రక్తి కట్టించారు. ఆ సినిమాలో అతడి పాత్ర ఎంతో డిగ్నిటీతో ఉండి ప్రేక్షకులను ఆకట్టుకుంది. రవితేజ లాంటి మాస్ హీరోనే అంతటి హుందా అయిన ప్రయోగాత్మక పాత్రలో మెప్పించినప్పుడు.. దశాబ్దాల అనుభవం ఉన్న మన నలుగురు సీనియర్ అగ్ర హీరోలు ఆ తరహా ప్రయత్నాలు చేయకపోవడం నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. సీనియర్ల వయసు- స్థాయికి తగ్గ ఆహ్లాదకరమైన, బలమైన స్క్రిప్టులను మన రచయితలు సృజించలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సీనియర్ హీరోలందరూ కేవలం భారీ బడ్జెట్ కమర్షియల్, హైవోల్టేజ్ యాక్షన్ సినిమాలపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. ఫలితంగా కంటెంట్ ఉన్న ప్రయోగాత్మక చిత్రాల్లో గుర్తుండిపోయే పాత్రల్లో వీరిని చూసే అవకాశం ప్రేక్షకులకు లేకుండా పోయింది. అభిమానుల అంచనాలు, మార్కెట్ లెక్కల పేరుతో దర్శకులు కూడా సేఫ్ గేమ్ ఆడుతూ రొటీన్ ఫార్ములా కథలనే వీరి ముందుంచుతున్నారు.అయితే ఈ సీనియర్ హీరోలు ప్రయోగాలకు దూరంగా ఉండటానికి మరో బలమైన కారణం కూడా ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో వీరంతా ఎంతో ఇష్టపడి నటించిన కొన్ని ప్రయోగాత్మక చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం వీరి ఆలోచనా ధోరణిని మార్చేసింది. ప్రయోగాలు చేస్తే కమర్షియల్‌గా దెబ్బతింటామనే భయంతోనే ఈ నలుగురు స్టార్ హీరోలు మళ్లీ తమకు అచ్చొచ్చిన మాస్ యాక్షన్ బాటలోనే పయనిస్తున్నారని అభిమానులు అభిప్రాయపడుతున్నాయి.



ఎలిగెంట్ బ్లాక్ కో-ఆర్డ్ లుక్‌లో అమైరా దస్తూర్ స్టన్స్



క్లాసీ కోర్సెట్ లుక్‌తో స్టైల్ ప్రమాణాలను పెంచేసిన రుక్షార్ ధిల్లాన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com